తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
సోమవారం
17 ఆగస్టు 2026



## నేడు కలెక్టరేట్లో ప్రజావాణి కార్యక్రమం రద్దు

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్
- ఆర్డీవో, తాసిల్దార్ కార్యాలయాల్లో యధావిధిగా ప్రజావాణి దరఖాస్తులు స్వీకరణ



**మెదక్ బ్యూరో, ఆగస్టు16(జనంసాక్షి):** ఈనెల 17న మెదక్ కలెక్టరేట్లో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. ప్రజావాణి హాల్లో జిల్లా ఇన్చార్జ్ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి చేతుల మీదుగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా అధికారులు వారికి కేటాయించిన విధుల్లో నిమగ్నమై ఉంటారని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్డీవో, తాసిల్దార్ కార్యాలయాల్లో యధావిధిగా ప్రజావాణి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు.

**మంత్రి చేతుల మీదుగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ...**

సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజావాణి హాల్ నందు 17.08.2026 న మధ్యాహ్నం 12:30 గంటలకు తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు మరియు భూగర్భ శాస్త్ర మంత్రిత్వ శాఖల మంత్రివర్యులు. మరియు జిల్లా ఇన్చార్జ్ మంత్రి శ్రీ. డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి గారి చేతుల మీదగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు . అధికారులందరూ వారికి కేటాయించిన విధుల్లో నిమగ్నమై ఉన్నందున సోమవారం కలెక్టరేట్లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం తాత్కాలికంగా రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ తెలిపారు. మండల ప్రజావాణి యధావిదంగా కొనసాగుతుందని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇట్టి విషయాన్ని ప్రజలందరూ గమనించి సహకరించాలన్నారు.

## సోమవారం 17 నుంచి మండల స్థాయిలోనూ ప్రజావాణి

- ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్..



**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 16(జనంసాక్షి);**

ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం రాష్ట్ర, జిల్లా, డివిజన్ స్థాయిలోనే కాకుండా ఈనెల 17వ తేదీ నుంచి మండల స్థాయిలోనూ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించినందున ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

మండల పరిషత్ కార్యాలయాల్లో ఎంపీడీవోలు నోడల్ అధికారులుగా సంబంధిత మండలాల అన్ని శాఖల అధికారులు ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 వరకు నిర్వహించే మండల స్థాయి ప్రజావాణిలో ప్రజలు తమ సమస్యలపై ఆర్జీలను సమర్పించవచ్చన్నారు. ఆయా శాఖలకు సంబంధించిన ప్రజావాణి ఫిర్యాదులను సంబంధిత అధికారులు నిర్దేశిత సమయంలోగా పరిష్కరిస్తారన్నారు. ప్రజలు చిన్న చిన్న సమస్యలకే కలెక్టరేట్ వరకు రావాల్సిన అవసరం లేకుండా ఆయా మండలాల్లోనే ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు వీలుగా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరుగుతుందన్నారు. అన్నిశాఖల సంబంధిత మండలాధికారులు మండల స్థాయి ప్రజావాణికి సకాలంలో విచ్చేసి విజయవంతం చేయాల్సిందిగా ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

## ఒంటరైన "ఊరుకొండ" ... నేటికి అభివృద్ధి శూన్యం

- మండలము ఏర్పాటై పది సంవత్సరాలు అయిన పాత భవనాల్లో పాలన
- ముఖ్యమంత్రి పర్యటనతో అభివృద్ధికి చిగురించిన ఆశలు
- మండల ప్రజలు పాలన ఒకవైపు - ఓటేసేది మరో వైపు
- డీలిమిటేషన్ భయంతోనే పట్టించుకోవడం లేదా?








మిగతా 7లో..

**ఉర్కొండ, ఆగస్టు 13(జనంసాక్షి):**

ఊరుకొండ మండలం ఏర్పాటై 10 సంవత్సరాలైనా మండల రూపురేఖలు, అభివృద్ధి ఏమాత్రం మారలేదు. నాగర్ కర్నూల్ జిల్లా ఊరుకొండ మండలం ప్రజలు పరిపాలనాపరంగా అతిపెద్ద గందరగోళానికి కేంద్రంగా మారి అస్తవ్యస్తంగా ఉంది.

మండలంలో దాదాపు 16 గ్రామపంచాయతీలు ఉన్నవి. 5,200 గృహాలు కలిగిన వారు, దాదాపు 22 వేల జనాభా ఉంది. 18 వేల ఓటర్లు ఉన్నారు. మండలం సుమారు 37,370 ఎకరాల విస్తీర్ణంలో ఉంది .గ్రామాలలో ఉన్న జనాభా ప్రకారం ఉర్కొండ మండలం తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరిగిన జిల్లాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా నాగర్ కర్నూల్ జిల్లాలో కలిసింది. కానీ ఓటు హక్కు మాత్రం జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోనే ఉంది.

**ఉద్యమంతో కల్వకుర్తి రెవెన్యూ డివిజన్ ఏర్పాటు...**

మండల ప్రజలు ఆర్డీవో కార్యాలయానికి వెళ్లాలంటే మహబూబ్ నగర్ 60 కిలోమీటర్లు వెళ్లాల్సి వచ్చేది. తెలంగాణ ఏర్పడిన తర్వాత గత ముఖ్యమంత్రి కేసీఆర్ హయాములో 2016లో నూతన జిల్లాల ఏర్పాటు సమయంలో కల్వకుర్తి రెవెన్యూ డివిజన్ కోసం అన్ని పార్టీల నాయకులు, తెలంగాణ ఉద్యమ నేతలు, విద్యార్థి సంఘాలు, యువత, ఉద్యోగులు గట్టిగా పోరాటం చేశారు. వారి కృషి ఫలితంగా ఊరుకొండతో పాటు వెల్దండ, చారగొండ, వంగూరు మండలాలను కలిపి కల్వకుర్తి రెవెన్యూ డివిజన్ ఏర్పాటైంది. ఫలితంగా ఇప్పుడు ఊరుకొండ మండలానికి సంబంధించిన ఆర్డీవో, డిఎస్పి, పోలీస్ సర్కిల్, సబ్-రిజిస్ట్రార్, ఇతర అన్ని శాఖల కార్యాలయాలు కల్వకుర్తి లో ఉన్నాయి. ఏ చిన్న పని ఉన్నా ప్రజలు 20 కి.మీ ప్రయాణించి కల్వకుర్తి వెళ్లాల్సి వస్తోంది.

**ఈ సమస్యకు పరిష్కారం ఎప్పుడు? బాధ్యత ఎవరిది?**

మండల ఏర్పాటుకు జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే డాక్టర్ లక్ష్మారెడ్డి సహకరించి కీలక పాత్ర పోషించడం జరిగింది. ప్రస్తుతం జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి "ఓట్లు మా నియోజకవర్గంలో పడ్డాయి,అభివృద్ధి బాధ్యత మాది" అనే కోణంలో ఉన్న, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి "రెవెన్యూ డివిజన్ మా పరిధిలో ఉంది, మేము చూసుకుంటాం"అనే ధోరణిలో ఉన్న కానీ గ్రౌండ్లో మాత్రం రెండు వైపులా ఫైళ్లు పెండింగ్లో ఉంటున్నాయి అని అక్కడి ప్రజలు అభిప్రాయ పడుతున్నారు. "ఓటు అడగడానికి ఒకరు, పని కోసం ఇంకొకరి దగ్గరికి వెళ్లాలంటే చివరికి మాకు మిగిలేది నిరాశే" అంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**సీఎం రేవంత్ రెడ్డి పర్యటనతో ప్రజలకు చిగురించిన ఆశలు...**

జులై నెలలో సీఎం రేవంత్ రెడ్డి జడ్పిటిసిగా గెలిచి 20 సంవత్సరాలు అయినా సందర్భంలో ఊరుకొండ మండల పర్యటనలో ఊరుకొండ పేట దేవాలయ అభివృద్ధికి 10 కోట్లు ప్రకటించారు. నూతన మండలం కావడంతో ఎమ్మార్వో, ఎంపీడీవో, పోలీస్ శాఖ వంటి కార్యాలయాలు ఇంకా అద్దె, పాత భవనాల్లోనే నడుస్తున్నాయి. నూతన భవనాల కోసం స్థల సేకరణ ప్రక్రియ ఇప్పుడు మొదలైంది.

**గ్రామలకు వెళ్లడానికి రోడ్డు లేక తీవ్ర ఇబ్బందులు...**

రోడ్లు దాదాపుగా కొన్ని గ్రామీణ రోడ్లు బాగాలేక, వర్షానికి చాలా వరకు రాకపోకలు నిలిచిపోతాయి అని. వర్షాకాలంలో రోడ్లపైన కల్వర్టులు లేక చాలా గ్రామాల రోడ్లు దెబ్బతింటున్నాయని మండల ప్రజలు తెలియజేస్తున్నారు.వేసవిలో బోర్లపైనే ఆధారపడే పరిస్థితి వస్తుందని అన్నారు. వైద్యం విషయంలో పీహెచ్సి లో సిబ్బంది కొరత కూడా ఉంటుందని, అత్యవసరానికి కల్వకుర్తి లేదా నాగర్ కర్నూల్ వెళ్లే జిల్లాకు వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. అలాగే విద్య విషయనికి వస్తే మండలంలో జూనియర్ కాలేజీ లేకపోవడంతో ఇంటర్ విద్యార్థులు రోజూ 20 కి.మీ ప్రయాణం చేసి కల్వకుర్తి మరియు మిడ్జిల్ వంటి మండలాలకు వెళ్లాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పాలన పరంగా ఒక పని కోసం జిల్లా నాగర్ కర్నూల్, రెవెన్యూ కోసం కల్వకుర్తి, రాజకీయం కోసం జడ్చర్ల అంటూ 3 చోట్ల తిరగాల్సిన దుస్థితి ఉందని తెలియజేస్తున్నారు.

**జడ్చర్ల - కల్వకుర్తి ఎమ్మెల్యే సార్ మా సమస్య పరిష్కరించండి...**

ఓట్లు వేయించుకునే జడ్చర్ల ఎమ్మెల్యే ,పరిపాలన కోసం వెళ్లే కల్వకుర్తి ఎమ్మెల్యే ఇద్దరు అధికార పార్టీ ఎమ్మెల్యేలే కాబట్టి మా ఊరుకొండ మండల ప్రజల ఆవేదన మా పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని మా మండలాన్ని శాశ్వత పరిష్కార దిశగా చేయాలని లేదంటే మండలం భవిష్యత్తు వెనుకబడిపోతుందని మాకు తొందరలో మంచి మంచి వార్త తెలియజేసి న్యాయం చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

**డీలిమిటేషన్ భయంతోనే పట్టించుకోవడం లేదా?**

డిలిమిటేషన్ అయితే ఊరుకొండ మండలం కల్వకుర్తి నియోజకవర్గం లో కలుస్తుందని ఎమ్మెల్యే పట్టించుకోవడంలేదని

## సీఎం సభను విజయవంతం చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు, ప్రజలకు ధన్యవాదాలు

**• డిసిసి అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి**



**సంగారెడ్డి, ఆగస్టు 16(జనంసాక్షి):** సంగారెడ్డి పట్టణంలో స్మార్ట్ రేషన్‌కార్డు ప్రారంభోత్సవానికి వచ్చిన రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, సభను సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా సభకు వచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు ప్రజలకు ధన్యవాదాలు తెలియ జేసిన కాంగ్రెస్ పార్టీ డిసిసి అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి విలేకర్ల సమావేశంలో ఆదివారం నాయకులకు ప్రజలకు ధన్యవాదా లు తెలిపారు.

ఈ సభ ఇంత విజయవంతం కావడానికి ముఖ్య కార్యకర్తలు నాయకులు ప్రజలు అని అన్నారు మంత్రి దామోదర్ రాజనర్సింహ, టిపిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, ఎమ్మెల్యే లు సంజీవరెడ్డి,ఎంపీ సురేష్ రెడ్డి, సంగా రెడ్డి, పటాన్చెరు, జహీరాబాద్, నారాయణ ఖేడ్, అందోల్ కాంగ్రెస్ పార్టీ నాయకుల కృషితో జనసమీకరణ చేసినందుకు ప్రత్యే కంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు జార్జ్, కౌన్సిలర్ నవాజ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గురువును కలుసుకుని ఆశీర్వాదాలు తీసుకున్న పూర్వ విద్యార్థులు

**• అనంతరెడ్డి సార్‌ను ఘనంగా సత్కరించిన 1986-87 బ్యాచ్**



**బెజ్జంకి, ఆగస్టు16(జనంసాక్షి):** బెజ్జంకి మండలంలోని బెజ్జంకి హైస్కూల్ 1986-87 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యా ర్థులు తమకు బయోసైన్స్ బోధించిన ఉపా ధ్యాయుడు అనంతరెడ్డి సార్‌ను కుటుంబ సభ్యులతో కలిసి ఘనంగా సత్కరించారు. 1987లో ఎస్ఎస్‌సీ పూర్తిచేసిన పూర్వ విద్యార్థులు గురువును కలుసుకుని, నాటి విద్యాభ్యాస రోజులను, ఆయనతో తమకున్న అనుబంధాన్ని నెమరువేసుకున్నారు.

ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లా డుతూ అనంతరెడ్డి సార్ క్రమశిక్షణకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చేవారని, తన విధులను అం కితభావంతో నిర్వర్తించేవారని గుర్తు చేసు కున్నారు. విద్యార్థులను చదువులోనే కాకుం డా జీవితంలోనూ ఉన్నతంగా ఎదగాలని ప్రోత్సహిస్తూ అనేక విషయాల్లో మార్గనిర్దేశం చేసేవారని తెలిపారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ సతీమణులు, పిల్లలతో కలిసి అనంతరెడ్డి సార్‌కు పాదాభివందనం చేసి ఆశీర్వాదాలు తీసుకున్నారు. అనంతరం ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా అనంతరెడ్డి సార్ మాట్లాడుతూ తన శిష్యులు చదువులు పూర్తిచేసి, ఉద్యో గాలు, కుటుంబాలతో జీవితంలో స్థిరపడిన తర్వాత కూడా తనను గుర్తుంచుకుని కుటుం బ సమేతంగా వచ్చి కలవడం ఎంతో ఆనం దంగా ఉందన్నారు. తనశిష్యులు, వారి కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో, వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు.




## రాయికోడ్ వీరభద్రుణ్ణి దర్శించుకున్న జహీరాబాద్ సివిల్ కోర్టు జడ్జ్

**• ఘన స్వాగతం పలికిన ఆలయ చైర్మన్, అర్చక బృందం**

**రాయికోడ్, ఆగస్టు16(జనంసాక్షి):** పవిత్రమైన శ్రావణమాసం శుభ సందర్భంగా.. ప్రసిద్ధిగాంచిన రాయికోడ్ లోని భద్రకాళి సమేత శ్రీ వీరభద్రుడి దైవ క్షేత్రాన్ని జహీరాబాద్ సివిల్ కోర్టు జడ్జ్ కవిత, కుటుంబ, బంధు సమేతంగా విచ్చేసి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ సతీష్ కుమార్ కులకర్ణి, ఆలయ వేద పండితుడు వీరస్వామి, జూనియర్ సహాయకులు కృష్ణ, అర్చక బృందం ఘన స్వాగతం పలికారు. పండితుల వేద మంత్రోచ్ఛరణల మధ్య జడ్జ్, జడ్జ్ కుటుంబ సభ్యులు వీరభద్రుడికి, శివలింగానికి ప్రత్యేక రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయం చుట్టు ఉన్న దేవి దేవతలను దర్శించుకున్నారు. అనంతరం ఆలయ చైర్మన్ సతీష్ కుమార్ కులకర్ణి ఘనంగా సన్మానించి మహా ప్రసాదాన్ని అందజేశారు.

## భక్తిశ్రద్ధలతో పస్కా పండుగ వేడుకలు



**కోహీర్, ఆగస్టు 16(జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా కోహీర్ మండ లంలోని ఖానాపూర్ గ్రామ మెథడిస్ట్ చర్చి క్రైస్తవ సంఘం ఆధ్వ ర్యంలో పవిత్ర పస్కా పండుగ వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కోహీర్ డీఎస్ మాట్లాడుతూ, పస్కా పండుగ క్రైస్తవుల విశ్వాసాని కి ప్రతీక అని పేర్కొన్నారు. యేసుక్రీస్తు త్యాగం, ప్రేమ, క్షమా గుణం, పునరుత్థాన సందేశాలను ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో ఆచరించాలని పిలుపునిచ్చారు. పస్కా పండుగ మానవాళికి శాంతి, ప్రేమ, ఐకమత్యం అనే గొప్ప సందేశాన్ని అందిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు, ఆరాధన గీతాలు నిర్వహించారు. సంఘ పెద్దలు, పాస్టర్లు, రాములు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పండుగను ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా జరుపుకున్నారు.

## గవర్నర్‌ను కలిసిన ఎదుల్లాపూర్ సర్పంచ్



**శివ్వంపేట, ఆగస్ట్ 16(జనంసాక్షి):** భారత స్వాతంత్ర్య ధినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం రాత్రి గవర్నర్ బంగ్లా లోక్‌భవన్‌లో జరిగిన తేనేటి విందు కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులు, ప్రముఖులతోపాటు శివ్వంపేట మండలం ఎదుల్లాపూర్ సర్పంచ్, సర్పంచుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు కల్లూరి హనుమంతరావును సైతం గవర్నర్ ఆహ్వా నించగా, ఎట్ ది హోమ్, తేనేటివిందు కార్యక్రమానికి హనుమంతరావు కీర్తన దంపతులు హాజరయ్యారు. తమను తినేటివిందు కార్యక్రమానికి ఆహ్వానించిన సందర్భంగా హనుమంతరావు దంపతులు సంతోషం వ్యక్తంచేస్తూ, ఆదివారం గవర్నర్ భవన్‌లో తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను మర్యాదపూర్వకంగా కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## అప్పాజీపల్లి ప్రాథమిక పాఠశాలకు ప్రొజెక్టర్, స్క్రీన్ అందజేత

**• గ్రామ సర్పంచ్ నాయిని వెంకట్ గౌడ్ (గజిని)**



**కొల్చారం, ఆగస్టు 16(జనంసాక్షి):** కొల్చారం మండలం అప్పాజీపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన నాణ్యమైన విద్యను అందించేందుకు గ్రామ సర్పంచ్ నాయిని వెంకట్ గౌడ్(గజిని) ముందు కు వచ్చారు. ఇందులో భాగంగా సుమారు రూ.25 వేల విలువైన ప్రొజెక్టర్, స్క్రీన్‌ను పాఠశాలకు అందజేశారు. ప్రాథమిక స్థాయి విద్యార్థు లకు పాఠ్యాంశాలను దృశ్యరూపంలో బోధించేందుకు ఈ పరికరాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఉపాధ్యాయులు తెలిపారు. సర్పంచ్ వెంకట్ గౌడ్(గజిని) చేసిన సహకారాన్ని పాఠశాల సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

## తొట్టెల కార్యక్రమానికి హాజరైన బీఆర్ఎస్ నాయకులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి



**హవేలీ ఘనపూర్, ఆగస్టు16(జనంసాక్షి):** హవేలీ ఘనపూర్ మండలం తొగిట గ్రామ మాజీ సర్పంచ్ మంద శ్రీహరి మనుమని తొట్టెల కార్యక్రమాన్ని ఏడుపాయలలో ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్ రెడ్డి, శశిరెడ్డిలతో కలిసి హాజరై చిన్నారిని ఆశీర్వదించారు.

ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపిన కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, చిన్నారి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించా లని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కసిరెడ్డి మాణిక్యరెడ్డి, హవేలీ ఘనపూర్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్య క్షులు సీహెచ్ శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ సాయిలు, నాయకులు రామ చంద్రరెడ్డి, యామిరెడ్డి, రాజేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## నారాయణఖేడ్‌లో జర్నలిస్టుల సమావేశం.. నూతన కమిటీ ఎన్నికకు ఏర్పాట్లు

**నారాయణఖేడ్: ఆగస్టు 16 (జనంసాక్షి):** జర్నలిస్టుల సమస్యలు, హక్కులు, సంక్షేమంపై చర్చించేందుకు నారాయణఖేడ్‌లో జర్నలిస్టుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సంగారెడ్డి జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు సయ్యద్ ఆసిఫ్, జిల్లా జాయింట్ సెక్రటరీ అబ్దుల్ రౌఫ్, ఈసీ మెంబర్ హసీబ్ పటేల్ హాజరయ్యారు.



ఈ సందర్భంగా సయ్యద్ ఆసిఫ్ మాట్లాడుతూ.. త్వరలో జరగనున్న నూతన కమిటీ ఎన్నికలను ఏకగ్రీవంగా నిర్వహించేందుకు జర్నలిస్టులందరూ ఐక్యంగా ముందుకు రావాలని కోరారు. వచ్చే నెల 6వ తేదీ ఆదివారం నిర్వహించనున్న నియోజకవర్గ కార్యవర్గ సమావేశానికి జర్నలిస్టులందరూ హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యవర్గ సమావేశానికి రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారని తెలిపారు. జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం TUWJ (IJU) నిరంతరం పోరాడుతోందని సయ్యద్ ఆసిఫ్ పేర్కొన్నారు.

ఈ సమావేశంలో సీనియర్ జర్నలిస్టులు, యూనియన్ బాధ్యులు ఎం.ఏ. అలీమ్, జీవన్ రావు, వెంకటేశం, విఠల్, ఇస్తారీ వెంకటేశం, అశోక్, సత్తార్, జావిద్, సత్యం, భూమయ్య, కౌసర్, నాథేక్, సంజీవ్, బుగుడాల రాములు, రషీద్, సంతోష్, ప్రతాప్, శరణప్ప, సంగమేశ్వర్ రెడ్డి, సంగప్ప, సంజు, హబీబ్, అంబాదాస్, మాణిక్ తదితర జర్నలిస్టు మిత్రులు పాల్గొన్నారు.

## విద్యుత్ వాహనాలతో ఖర్చు తగ్గింపు.. కాలుష్యానికి చెక్

- నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి

**పెద్ద శంకరంపేట, ఆగస్టు 15(జనంసాక్షి):** పెద్దశంకరంపేటలో మండల కేంద్రమైన రాజన్న ఈవీ మోటార్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎలక్ట్రిక్ వెహికల్స్ షోరూమ్‌ను నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా షోరూమ్ ప్రొప్రైటర్ కనకరాజు గౌడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. పెరుగుతున్న ఇంధన ధరల నేపథ్యంలో ఎలక్ట్రిక్ వాహనాలు ప్రజలకు ఆర్థికంగా ప్రయోజనకరంగా ఉంటాయని అన్నారు. పెట్రోల్, డీజిల్ వాహనాలతో పోలిస్తే విద్యుత్ వాహనాల నిర్వహణ ఖర్చులు తక్కువగా ఉండటంతో పాటు, వాయు కాలుష్యాన్ని తగ్గించడంలో ఇవి దోహదపడతాయని తెలిపారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ఇంధన వ్యయాన్ని తగ్గించుకోవాలనుకునే వారికి ఎలక్ట్రిక్ వాహనాలు మంచి ప్రత్యామ్నాయమని



పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరిగితే భవిష్యత్‌లో కాలుష్య నియంత్రణకు మరింత ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. ప్రజలు ఆధునిక సాంకేతికతను వినియోగించుకుంటూ పర్యావరణహిత రవాణా వైపు అడుగులు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు జంగం శ్రీనివాస్, సురేష్ గౌడ్, శంకర్ గౌడ్, మహేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా వ్యవసాయ శాఖకు ఉత్తమ పురస్కారం

**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 16(జనంసాక్షి);** జోగులాంబ గద్వాల జిల్లా వ్యవసాయ శాఖ పని తీరుకు రాష్ట్రస్థాయి ఉత్తమ పురస్కారం లభించినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.



80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాదులో నిర్వహించిన వేడుకల్లో జోగులాంబ గద్వాల జిల్లా వ్యవసాయ శాఖ తరపున తాను రాష్ట్రస్థాయి ఉత్తమ పనితీరు అవార్డును రాష్ట్ర వ్యవసాయ సంచాలకులు గోపి చేతుల మీదుగా అందుకున్నట్లు చెప్పారు. జిల్లాలో రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా అందుతున్న సేవలను మరింత సమర్థవంతంగా అందించడంతో పాటు, ప్రభుత్వ వ్యవసాయ పథకాలను క్షేత్రస్థాయిలో విజయవంతంగా అమలు చేయడంలో అధికారులు, సిబ్బంది చేసిన కృషికి ఈ అవార్డు గుర్తింపుగా నిలిచిందన్నారు.

జిల్లా కలెక్టర్ సహకారంతో మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారుల కృషి వలన ఈ గుర్తింపు సాధ్యమైందని తెలిపారు.

ఇకముందు కూడా తమ అధికారులు, సిబ్బంది రెట్టింపైన ఉత్సాహంతో, బాధ్యతతో పని చేసి రైతుల సంక్షేమానికి కృషి చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

## శ్రీ స్వయంభూ శంభు లింగేశ్వర సేవా సమితి ట్రస్ట్ నూతన పాలక మండలి ఎన్నిక

- ఆలయ అభివృద్ధి, కోనేరు పునరుద్ధరణే లక్ష్యం
- నూతన అధ్యక్షుడు మంచాల శ్రీనివాస్

**కొండపాక, ఆగస్టు 16(జనంసాక్షి):** దుద్దడ గ్రామ పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ స్వయంభూ శంభు లింగేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలోని ట్రస్ట్ కార్యాలయంలో ఆదివారం 'శ్రీ స్వయంభూ శంభు లింగేశ్వర సేవా సమితి ట్రస్ట్' నూతన పాలక మండలి ఎన్నికలు ఘనంగా నిర్వహించారు. ఈ ఎన్నికల ప్రక్రియకు అధికారులుగా గొల్లపల్లి రఘురామ శర్మ, పెద్ది నర్సయ్య లు వ్యవహరించి, నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా మంచాల శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా గోనె శ్రీనివాస్, నర్ర దేశాయి రెడ్డి,



ప్రధాన కార్యదర్శి అనంతుల నరేందర్, కోశాధికారిగా పెద్ది కుమారస్వామి, సహాయ కార్యదర్శులుగా మంచాల చిన్న శ్రీనివాస్, బూర్గుల వెంకటరమణ, సలహాదారులుగా మంచాల కృష్ణమూర్తి, అమీరిశెట్టి వెంకటేశం తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన మంచాల శ్రీనివాస్ మాట్లాడుతూ, ఆలయ సమగ్ర అభివృద్ధికి పాలక మండలి సభ్యులందరి సమన్వయంతో కృషిచేస్తామని తెలిపారు. ముఖ్యంగా ఆలయ ప్రాంగణంలోని పవిత్ర కోనేరు పునరుద్ధరణ పనులలో మిగిలి ఉన్న అసంపూర్తి పనులను హనుమదీక్ష సేవా సమితి సభ్యులతో సమన్వయ పరచుకొని త్వరితగతిన పూర్తి చేయడమే తమ ప్రథమ కర్తవ్యమని స్పష్టం చేశారు. భక్తుల సౌకర్యార్థం మరిన్ని మౌలిక వసతులు కల్పించి, నిత్య పూజా సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా ముందుకు తీసుకెళ్తామని సంకల్పం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు వడ్లకొండ శ్రీనివాస్, ఆరేపల్లి మహదేవ్,కోట శ్రీనివాస శర్మ, పబ్బోజు శ్రీనివాస్,పబ్బోజు రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయంలో చోరీ..

## హుండి పగలగొట్టి రూ.20వేలతో పరారీ

### కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న హద్నూర్ పోలీసులు

**న్యాల్‌కల్, ఆగస్టు16(జనంసాక్షి):** శ్రీ హనుమాన్ దేవాలయంలోని హుండీని గుర్తు తెలియని దుండగులు పగలగొట్టి దాదాపు రూ:20000 నగదుతో పరారైన చోరీ సంఘటన మండలంలోని మిర్జాపూర్ (బి) గ్రామంలో చోటు చేసుకుంది. ఆలయ భక్తులు, స్థానిక ఎస్సై సుజిత్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మిర్జాపూర్ (బి) గ్రామంలోని శ్రీ హనుమాన్ దేవాలయంలో శ్రావణమాసం శుభ సందర్భంగా రాత్రి నుండి అర్ధరాత్రి వరకు గత కొన్ని రోజులుగా భజన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ నెల16 ఆదివారం, అర్ధరాత్రి అనంతరం ఆలయానికి తాళం వేసి భక్తులు వారి వారి స్వగృహాలకు వెళ్లిపోయారు. రోజు వారీగా ఆలయాన్ని శుభ్రపరిచేందుకు వచ్చిన తిప్పమ్మ (స్వీపర్) ఆలయం వద్దకు వెళ్లగా.. తలుపులు పగల కొట్టడం, ఆలయంలో హుండీ కనిపించకపోవడంతో.. స్థానిక భక్తులకు సమాచారం ఇచ్చారు. స్వీపర్ తిప్పమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై సుజిత్ తెలిపారు.

## ఈ నెల 19న జగదీశ్వరి మాత జన్మదినోత్సవం

- న్యాల్‌కల్‌లో గోడపత్రికను ఆవిష్కరించిన భక్తజనం

**న్యాల్‌కల్, ఆగస్టు 16, (జనంసాక్షి):** పరబ్రహ్మ సద్గురు జగదీశ్వరిమాత జన్మదినోత్సవ గోడ పత్రికను భక్తజనం ఆవిష్కరించారు. శ్రీ జగదీశ్వరి మాత యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం న్యాల్‌కల్ లోని శ్రీ హనుమాన్ మందిర సమీపాన జన్మదినోత్సవ గోడపత్రికను ఆవిష్కరించారు.



కర్ణాటకలోని బీదర్ జిల్లా, మైలార్‌లోని ఆనందాశ్రమంలో జన్మదిన వేడుకను ఘనంగా నిర్వహించేందుకు భక్తజనం ముమ్మర ప్రచారాన్ని చేపట్టారు. జన్మదినోత్సవ కార్యక్రమానికి జగదీశ్వరి మాత భక్తగనం అధిక సంఖ్యలో తరలివచ్చి వేడుకను విజయవంతం చేయాలని భక్తులు కోరారు. గోడపత్రికను ఆవిష్కరించిన వారిలో స్థానిక భక్తులు పాల్గొన్నారు.

## శ్రావణమాస వేళ నాగప్పలకు భక్తుల ప్రత్యేక పూజలు..



**గద్వాల, ఆగస్టు 16(జనంసాక్షి):** గద్వాల పట్టణంలో శ్రావణమాసం సందర్భంగా నాగుల పుట్టలకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.నది అగ్రహారం రోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో వెలసిన నాగుల పుట్ట వద్దకు మహిళలు కుటుంబ సమేతంగా తరలివచ్చారు.నాగప్పలకు పాలు పోసి,పసుపు,కుంకుమలతో పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.భక్తుల రాకతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి.

## రైతులకు కరెంట్ కష్టాలు.. ఎరువుల కొరత

- రైతు సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరించింది
- మరిపల్లి సర్పంచ్ సత్తు భూపాల్ రావు



**ఉప్పునుంతల (జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని మరిపల్లి సర్పంచ్ సత్తు భూపాల్‌రావు తీవ్రస్థాయిలో విమర్శించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రస్తుతం వానాకాలంలో వరినాట్లకు రైతులు తమ పొలాలను సిద్ధం చేసుకుంటుండగా.. పగటి పూట కనీసం 5 గంటలు కూడా నిరంతర విద్యుత్ సరఫరా లేకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పగలు వేళల్లోనే సాగు పనులు చేయాల్సిన పరిస్థితిలో కరెంట్ లేకపోవడంతో ట్రాక్టర్లు, మోటార్లు నిలిచిపోతున్నాయని, దీంతో రైతులు పొలాల్లోనే నిరాశతో వెనుదిరుగుతున్నారని తెలిపారు. పచ్చి పోయే కరెంట్‌తో కనీసం రైతులు వరి నాట్లకు ఒక్క మడిని కూడా సరిగా దున్నుకోలేని దుస్థితి నెలకొందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

యూరియా కోసం రోజుల తరబడి క్యూలలో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడిందని, అవసరమైన సమయంలో ఎరువులు అందక పంటలు దెబ్బతింటున్నాయని ఆయన మండిపడ్డారు. డీఏపీకి సబ్సిడీ ఇవ్వకపోవడం, మార్కెట్‌లో ధరలు పెరిగిపోవడం వల్ల రైతులు అదనపు భారం మోస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం రైతుల సమస్యలను పట్టించుకోకుండా కేవలం ప్రకటనలకే పరిమితమవుతోందని విమర్శించారు.

రైతులు పండించిన వరి ధాన్యం కొనుగోలు విషయంలో కూడా స్పష్టత లేకపోవడం, కొనుగోలు కేంద్రాల్లో ఆలస్యం, తూకం సమస్యలు వంటి కారణాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన ఆరోపించారు. విత్తనాల ఎంపిక నుంచి కరెంట్ సరఫరా, ఎరువుల పంపిణీ వరకు ప్రతి దశలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని, ఇదే పరిస్థితి కొనసాగితే రైతులు మరింత సంక్షోభంలోకి నెట్టబడతారని హెచ్చరించారు.

తక్షణమే విద్యుత్ సరఫరాను మెరుగుపరచాలని, ఎరువులు, విత్తనాలు సకాలంలో అందించాలని, ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకపోతే రైతుల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళనలు తప్పవని ఆయన హెచ్చరించారు.

## నూతన బాధ్యతలు చేపట్టిన వారికి ఘన సన్మానం

**వనపర్తి బ్యూరో, ఆగస్టు 16 (జనంసాక్షి):** వనపర్తి పట్టణ సగర సంఘం ప్రధాన కార్యదర్శిగా, శ్రీ వెంకటేశ్వర రియల్ ఎస్టేట్ సంఘం అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన చీర్ల శ్రీనివాసులు, చీర్ల గోవర్ధన్ సాగర్‌లను వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఉపసర్పంచ్ చీర్ల జనార్ధన్ సాగర్ ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన వారిని శాలువాలతో సత్కరించి, పూల బొకేలు అందజేసి అభినందనలు తెలిపారు. సంఘాల అభివృద్ధికి, సభ్యుల సంక్షేమానికి నూతన బాధ్యతలు చేపట్టిన వారు కృషి చేయాలని చీర్ల జనార్ధన్ సాగర్ ఆకాంక్షించారు.



ఈ కార్యక్రమంలో చీర్ల నాగేంద్రం, చీర్ల ఆంజనేయులు, మాజీ వార్డు మెంబర్ చీర్ల పాండు సాగర్, చీర్ల శ్రీనివాసులు, చీర్ల మహేష్, చీర్ల మన్నెం కొండ, చీర్ల దేవేందర్, చీర్ల కిరణ్, గుంటి సుధాకర్, చీర్ల సుధాకర్, చీర్ల కృష్ణయ్య, గుంటి మన్యం, చీర్ల శివ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రావణం..సర్వం శుభప్రదం..!

- జిల్లా వ్యాప్తంగా ఆలయాలలో ఆధ్యాత్మిక శోభ

**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 16(జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా అన్ని ఆలయాలలో ఆధ్యాత్మిక శోభ నెలకుంది. ప్రకృతి కూడా నూతన శోభను సంతరించుకుంది. వర్షాలు ప్రారంభ మయ్యాయి. శ్రావణమాసంలో ప్రతి ఇల్లూ ఆల యాన్ని తలపిస్తుంది. ఈ నెలంతా మహిళలకు పండగే...నెల రోజులపాటు ఉదయం, సాయంత్రం భగవన్నామ స్మరణలో ఉంటారు.

శ్రావణ మాసంలో చేపట్టే ఏ కార్యక్రమం అయినా ఎంతో పవిత్రతతో కూడుకున్నది. అంతే కాకుండా ఈ నెలలో ఎన్నో మంచి రోజులు, విశిష్ట పండగలు కూడా ఉన్నాయి. సనాతన ధర్మంలో హిందూ చాంద్రమానం ప్రకారం పన్నెండు మాసాల్లో ఐదోది ఎంతో పవిత్రత కలిగినటువంటిది శ్రావణ మాసం. పౌర్ణమినాడు చంద్రుడు శ్రవణ నక్షత్రంలో సంచ రించడం వల్ల ఈ నెలకు శ్రావణ మాసం అని పేరు వచ్చింది. వర్ష రుతువు ప్రాంభమవుతుంది.

త్రిమూర్తుల్లో స్థితికారుడు, దుష్ట శిక్షకుడు, శిష్ట రక్షకుడు అయిన మహావిష్ణువుకు, ఆయన దేవేరి (భార్య) మహాలక్ష్మికి అత్యంత ప్రీతికరమైన మాసం శ్రావణం కావడంతో.. మహావిష్ణు పూజకు ఎంతో శక్తి ఉంటుందని పురాణాలు చెబుతున్నాయి.

**శివారాధనకు ఎంతో విశిష్టత....**

దక్షిణా యనంలో వచ్చే విశిష్టమైన మాసాల్లో శ్రావణం ఒకటి. ఈ మాసం శివపూజకు విశిష్ట మైనది. ముఖ్యంగా భగవంతుని ఆరాధనలో శివ, కేశవ భేదం లేకుండా పూజించడానికి ఎంతో విశిష్ట మైనది. శ్రావణ మాసంలో చేసే కార్యక్రమాలు వేల రెట్లు శుభ ఫలితాలు ఇస్తాయి. సోమవారాలు పగలంతా ఉపవాసం ఉండి రాత్రి వేళల్లో స్వామివారికి రుద్రాభిషేకాలు, బిల్వార్చన చేస్తే పాపాలు కడతేరుతాయని శాస్త్ర వచనం. సోమవరాల్లో శివుడి ప్రీత్యార్థం వ్రతం ఆచరించాలి. ఈ వ్రతంలో ఉపవాసం ఉండగలిగినవారు పూర్తిగా, అలా సాధ్యంకాని పక్షంలో రాత్రిపూజ ముగిసిన తర్వాత ఆహారాన్ని భుజించవచ్చు. ఈ వ్రతాన్ని ఆచరించడం వల్ల అనేక శుభఫలితాలు కలుగుతాయి. వీటికితోడు శ్రావణ శుక్ల పక్షంలో గల పదిహేను రోజులు ఎంతో విశిష్టమైనవని, ఒక్కోరోజు ఒక్కో దేవుడికి పూజలు చేయాలని వేద శాస్త్రాలు చెబుతున్నాయి. ఈ మాసంలో భక్తితో ఆచరించే ప్రతి పూజకు తగిన ప్రతిఫలం ఉంటుందన్నారు పండితులు.

**నోముల మాసం...**

వ్రతాలు, పూజలు, నోములకు నెలవైనది శ్రావణ మాసం. ఈ నెలలో ఇంటింటా శ్రావణ శోభ కనిపిస్తుంది. శ్రావణంలో నోచే ప్రతి నోముకూ ఓ విశిష్టత ఉంది. వెంకటేశ్వరస్వామి నక్షత్రం కూడా శ్రవణమే కాబట్టి ఆయన భార్య లక్ష్మీదేవికి, సోదరి గౌరికి శ్రావణ శుక్రవారాల్లోనే ప్రత్యేక పూజలు చేస్తారు. ఈ నెలలో వచ్చే శుక్రవారాలు నోములకు, వ్రతాలకు కేటాయించడానికి ప్రత్యేక కారణమే ఉంది. శ్రావణ పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం రోజున వరలక్ష్మీ వ్రతం చేసుకుంటారు. మంగళగౌరీ వ్రతాన్ని శ్రావణమాసంలో వచ్చే ఏ మంగళవారం నాడైనా చేసుకోవచ్చు. ఈ వ్రతాన్ని యువతులు పెళ్లికి ముందు నాలుగేళ్లు, పెళ్లి తర్వాత ఒక ఏడాదిపాటు నిర్వహిస్తారు. వరలక్ష్మీ వ్రతం మాత్రం పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం రోజున చేస్తారు. ఈ వ్రతాన్ని జీవితాంతం ఆచరి స్తారు. మంగళ గౌరి వ్రతం ఐదోతనం కోసం, సంతానం కోసం;



వరలక్ష్మీ వ్రతాన్ని కుటుంబ సౌఖ్యం కోసం చేస్తారు. రెండు వ్రతాలు నిర్వహించే పద్ధతుల్లో, చెప్పే కథల్లో కూడా స్వల్ప వ్యత్యాసాలున్నాయి.

**వ్రతాల వెనుక ఆరోగ్య రహస్యాలు...**

వ్రతాలకు శ్రావణమాసం ఎంచుకోవడంతో ఆరోగ్య పరమైన కారణాలు చాలా ఇమిడి ఉన్నాయి. పూర్వం శ్రావణ మాసంలో భర్తలు పొలం పనుల్లో నిమగ్నమయ్యేవారు. అలాంటప్పుడు తీరుబడిగా ఇంటిపట్టున ఉండే భార్యలకు తగినంత కాలక్షేపం కోసం వ్రతాలు చేసుకునే ఆచారం మొదలైంది. ఈ వ్రతాల్లో ఆచరించే కట్టుబాట్లు, నియమాలు చక్కటి వ్యాయామాన్ని, ఆరోగ్యాన్ని అందిస్తాయి. వరలక్ష్మీ వ్రతం రోజు వాయనంగా ఇచ్చే మొలక శనగలు పోషక విలువలతో ఉంటాయి. వర్షా కాలంలో పాదాలు ఎక్కువసేపు తడిగా ఉండటం వల్ల ఇన్ఫెక్షన్లు కలుగుతాయి. ఇలా కాళ్లకు సమస్య తలెత్తకుండా పసుపు పూసుకోవడాన్ని ఈ వ్రతాల్లో భాగం చేశారు. ఆవు నెయ్యితో వెలిగించే దీపాల ద్వారా విడుదలయ్యే దూపం వాయు కాలుష్యాన్ని హరిస్తుంది.

**శ్రావణమంతా శుభకరమే...**

**అర్చకులు అయ్యప్ప స్వామి...** శ్రావణమాసమంతా శుభకరమైనది. ప్రత్యేకించి శనివారాలలో ఆంజనేయస్వామికి విశిష్ట పూజలు నిర్వహి స్తున్నా కూడా మిగతా రోజులు కూడా పుణ్యదాయకమైనవే. ఈ మాసమంతా క్రమం తప్పక పూజలు చేస్తే అంతా మంచే జరుగుతుంది.

## ఉత్తమ పోలీస్ అవార్డులకు
# చిలప్‌చేడ్ పోలీసుల ఎంపిక....

- ఉత్తమ సేవలకు గుర్తింపుగా అవార్డులు
- పోలీస్ సిబ్బందికి అభినందనలు

చిలప్‌చేడ్, 15 ఆగస్టు మెదక్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అందిస్తున్న ఉత్తమ పోలీస్ అవార్డులకు చిలప్‌చేడ్ పోలీస్ స్టేషన్‌కు చెందిన రవి, సమరసింహారెడ్డి ఎంపికయ్యారు. విధి నిర్వహణలో అంకితభావంతో పని చేస్తూ పోలీస్ శాఖకు అందించిన సేవలకు గుర్తింపుగా ఈ అవార్డులు లభించాయి. ఈ సందర్భంగా ఉత్తమ పోలీస్ అవార్డులు అందుకున్న రవి, సమరసింహారెడ్డి, పోలీస్ సిబ్బందికి పలువురు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ శాంతి భద్రతల పరిరక్షణలో మరింత సమర్థవంతంగాపనిచేయాలని ఆకాంక్షించారు.

# రమణీయం కడు కమనీయం శివపార్వతుల కళ్యాణం



**వెల్దుర్తి, ఆగస్టు 16(జనంసాక్షి):** వెల్దుర్తిలో ప్రసిద్ధిగాంచిన పురాతన శ్రీ రాజరాజేశ్వరి ఆలయ 24వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వందలాది ఏళ్ల చరిత్ర గల ఆలయంలో కొలువైన అమ్మవారికి ఆలయ ధర్మకర్తలు పురోహితులు ఉదయాన్నే గణపతి పూజ పుణ్యావాచనము శివునికి శత్రుద్రాభిషేకం అమ్మవారికి పంచామృత అభిషేకాలు కుంకుమార్చనలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో శివపార్వతుల కల్యాణోత్సవం ఎంతో కన్నుల పండుగాజరిగింది. వచ్చిన ఆడపడుచులు అందరికీ అమ్మవారి వాహనాలను ఇవ్వడం జరిగింది.

మహిళలు అమ్మవారికి కానుకలు మొక్కుబడులు ఓడిబియాలు సమర్పించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన ప్రసాదాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు గిరీశ్వర్ శర్మ మాట్లాడుతూ వెల్దుర్తి లో అతి పురాతనమైన ఈ రాజరాజేశ్వరి దేవాలయంలో ఇలాంటి కార్యక్రమాలు చేయడం వల్ల ప్రజలందరికీ సకల శుభాలు జరుగుతాయని ప్రతి ఒక్కరూ భక్తి భావంతో మెదలాలని ఆయన అన్నారు

# 47వ రోజు పేటలో కొనసాగిన లయన్స్ క్లబ్ 'అన్నదానం'



**నారాయణపేట, ఆగస్టు 16 (జనంసాక్షి):** మానవ సేవే మాధవ సేవ అనే లక్ష్యంతో లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణపేట ఆధ్వర్యంలో ఏడాది పాటు నిర్వహిస్తున్న విల్స్ అండ్ మిల్స్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం నారాయణపేట పట్టణం లోని సత్యనారాయణ చౌరస్తాలో 47వ రోజు బాటసారులకు లయన్స్ క్లబ్ అధ్యక్షులు రవికుమార్ గౌడ్ ఆధ్వర్యంలో కొనసాగింది. మాజీ ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే చిట్టెం నర్సిరెడ్డి, చిట్టెం వెంకటేశ్వర్ రెడ్డి జ్ఞాపకార్థం సందర్భంగా స్పాన్సర్ చేశారు. ఈ సంద ర్భంగావారు మాట్లాడుతూ పట్టణానికి వివిధ పనుల కోసం వచ్చిన వారికి,పేదల ఆకలి తీర్చడం అభినంద నీయం అన్నారు. ఈ కార్యక్రమం దిగ్విజయంగా సాగాలని అందుకు తన వంతు సహకారం అందిస్తానని అన్నారు. ఈ సందర్భంగా లైన్స్ క్లబ్ అధ్యక్షు డు రవి కుమార్ గౌడ్ మాట్లాడుతూ సమాజంలో అవసరమైనవారికి అండగా నిలవడం సామాజిక బాధ్యతగా భావిస్తూ, లయన్స్ క్లబ్ ద్వారా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి రైతులు, ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు.. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు హరినారాయణభటాడ్,ఆంజనేయులు,చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో శరణతత్వ ప్రవచనాలు



**జహీరాబాద్, ఆగస్టు 14(జనంసాక్షి):** శ్రావణమాసాన్ని పురస్కరించుకుని జహీరాబాద్ పట్టణ వీరశైవ లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరణ తత్వ ప్రవచన మహోత్సవాలు నాల్గవ రోజు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. ఈ సందర్భంగా పరమ పూజ శ్రీ మ.ని.ప్ర బసవ మహంత స్వామీజీ భక్తులను ఉద్దేశించి ప్రవచనం చేశారు. బాసవేశ్వరుడు చూపించిన మార్గంలో అందరు నడుచుకోవాలన్నారు. ప్రతి మనిషి బాహ్య ఆడంబరాల కంటే మంచి నడవడి, సత్యం, ధర్మం, సేవా భావంతో జీవించడమే నిజమైన భక్తి అని పేర్కొన్నారు. కుల మతాలకు అతీతంగా ఉండి అందరు భక్తిమార్గంలో నడవాలన్నారు. శరణుల వచనాలు సమాజానికి అందించిన సందేశాలను వివరించిన స్వామీజీ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతతో పాటు సామాజిక బాధ్యతను కూడా గుర్తించి నడుచుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం అన్నప్రసాద దాతలైన సవది కళ్యాణ్, కావాలస్ శివానంద్‌లను స్వామిజి సత్కరించారు. కార్యక్రమానికి వీరశైవ లింగాయత్ సమాజ్ అధ్యక్షులు రాజశేఖర్ షెట్కార్, కార్యదర్శి రేకుల్గి సుభాష్,సమాజ పెద్దలు మడపతి బస్వరాజ్,బెండి శేఖర్ మహిళా భక్తులు, శరణులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామీజీ ప్రవచనాలను ఆలకించారు.

# పేదల పెన్నిధి పండుగ సాయన్న

- మత్స్యకారుల ఆరాధ్య దైవం.. పేదల పెన్నిధి పండుగ సాయన్న



**తెలకపల్లి, ఆగస్టు 16,(జనంసాక్షి):** మత్స్యకారుల ఆరాధ్య దైవం, బడుగు బలహీన వర్గాల పేదల పెన్నిధి పండుగ సాయన్న అని నాగర్ కర్నూలు జిల్లా మత్స్యశాఖ సొసైటీ జిల్లా అధ్యక్షులు వాకిటి ఆంజనేయులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారి సమీపంలో పండుగ సాయన్న విగ్రహ ఏర్పాటు కోసం భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పండుగ సాయన్న చరిత్ర చాలా గొప్పదని అన్నారు. పండుగ సాయన్న పేదలు, అణగారిన వర్గాల ప్రజలకు అండగా నిలిచి, వారి కోసం పోరాడిన ప్రజా వీరుడిగా చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని తెలిపారు. అన్యాయం, దోపిడీకి వ్యతిరేకంగా ధైర్యంగా నిలబడి సామాన్య ప్రజలకు అండగా ఉన్నందుకే ఆయనను ప్రజలు నేటికీ పేదల పెన్నిధిగా, ఆరాధ్య దైవంగా కొలుస్తున్నారని పేర్కొన్నారు. పండుగ సాయన్న ఆశయాలు, ధైర్యసాహసాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆయన చరిత్రను భావితరాలకు తెలియజేయడంతో పాటు, ఆయన స్మృతిని చిరస్థాయిగా నిలిపేందుకు విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా విగ్రహ ఏర్పాటు కోసం భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల మత్స్యకారులు, పండుగ సాయన్న అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ నాగర్ కర్నూల్ జిల్లా డైరెక్టర్ తెప్ప బాబు, కుమ్మెర గ్రామం సొసైటీ అధ్యక్షులు గుళ్ళ చెన్నకేశవులు, నాగనూలు డైరెక్టర్ తుమ్మల నాగేష్, గ్రామ 4వార్డు సభ్యులు మహమ్మద్ మక్సుద్, తెలకపల్లి గ్రామ మత్స్యకార సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సజ్జాపూర్‌లో ఘనంగా పస్కా పండుగ

- అధిక సంఖ్యలో హాజరైన క్రైస్తవ భక్తులు



**కోహిర్, ఆగస్టు16(జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా కోహిర్ మండల కేంద్రం లోని సజ్జాపూర్ మెథడిస్ట్ చర్చి ఆధ్వర్యంలో పస్కా పండుగ వేడుకలను క్రైస్తవ భక్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి సంఘ కాపరి బాలరాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు, స్తుతి ఆరాధనలు నిర్వహించారు. "లోకరక్షకుడా యేసయ్య... మా దేవుడవు నీవే తండ్రీ. లోకంలోని ప్రజలందరికీ ఎలాంటి కష్టాలు, సమస్యలు రాకుండా చూడాలని, ఈసారి వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండేలా ఆశీర్వదించాలని" సంఘ కాపరి బాలరాజ్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఆదివారం సజ్జాపూర్ మెథడిస్ట్ చర్చి నుంచి మహిళలు, క్రైస్తవ భక్తులు ప్రత్యేక పాటలు పాడుతూ, భజనలు చేస్తూ స్తుతి ఆరాధనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘ కాపరి బాలరాజ్ మాట్లాడుతూ, నేటి సమాజంలో ప్రతి ఒక్కరూ కొంత సమయాన్ని దైవ చింతనకు కేటాయించుకోవాలని సూచించారు. పస్కా పండుగ విశిష్టతను భక్తులకు వివరించారు. అనంతరం భక్తులు ఒకరికొకరు పస్కా పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సహపంక్తి భోజనాలు నిర్వహించారు. కార్యక్రమంలో చర్చి సంఘ పెద్దలు, యువతీ యువకులు, మహిళలు, ఇతర గ్రామాల నుంచి వచ్చిన పాస్టర్లు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఏఐవైఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులుగా చరణ్,రాజు

**చేర్యాల, ఆగస్టు 16(జనంసాక్షి):** అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) చేర్యాల మండల కమిటీని ఎన్నిక చేసినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షులు జనగాం రాజ్ కుమార్ ఆదివారం ప్రకటించారు. ఏఐవైఎఫ్ మండల అధ్యక్షులుగా కాశబోయిన చరణ్, మండల ప్రధాన కార్యదర్శిగా బోడపట్ల రాజు, ఉపాధ్యక్షులుగా మేకల ప్రభాకర్, కోశాధికారిగా శనిగరం రుత్విక్, సహాయ కార్యదర్శిగా ముద్దల రాజు, మొత్తం 11 మందితో కమిటీని ఎన్నుకున్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చేర్యాల మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి, సంఘం బలోపేతానికి కృషి చేస్తామని అన్నారు. తమ ఎన్నికకు కృషి




చేసిన ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జనగాం రాజ్ కుమార్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందే అశోక్, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు ఈరి భూమయ్య, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు గూడెపు సుదర్శన్, బొజ్జ బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి వంగ రాజేశ్వర్ రెడ్డి రూ. 5000 ఆర్థిక సహాయం

**నంగునూర్, ఆగస్టు 16(జనంసాక్షి):** నంగునూరు మండలం రాజగోపాలపేట గ్రామానికి చెందిన గౌరబోయిన సంతోష్ ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో మృతి చెందడం బాధాకరమని వంగ రాజేశ్వర్ రెడ్డి అన్నారు. ఈ విషాద విషయం తెలుసుకున్న వంగ రాజేశ్వర్ రెడ్డి వెంటనే సంతోష్ కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ. 5,000 ఆర్థిక సహాయం అందించారు. ఈ కష్టకాలంలో బాధిత కుటుంబానికి అండగా ఉంటామని, వారికి అన్నివిధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని వంగ రాజేశ్వర్ రెడ్డి భరోసా ఇచ్చారు.



## వేరుశనగ డికార్టికేటర్ ప్రారంభోత్సవానికి ఎంపీ, ఎమ్మెల్యే రాక

**ఉప్పునుంతల, (జనంసాక్షి):** మండల కేంద్రంలోని పీఏసీఎస్ గోదాంలో రైతు ఉత్పత్తిదారుల సంఘం (ఎఫ్‌పీఓ) సభ్యుల భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన వేరుశనగ డికార్టికేటర్‌ను సోమవారం ప్రారంభించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కర్నె లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమానికి నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవి, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరై డికార్టికేటర్‌ను ప్రారంభించనున్నారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రారంభోత్సవం మధ్యాహ్నం 12 గంటలకు పీఏసీఎస్ గోదాం ఆవరణలో నిర్వహించనున్నట్లు తెలిపారు.



## రాఖీ పౌర్ణమికి... తరలి రావాలే భక్తజనం



**నారాయణపేట,(జనంసాక్షి):** నారాయణపేట పట్టణంలోని శ్రీ భక్త మార్కండేయ స్వామి వారి ఆలయంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఈనెల 27 28న రాఖీ పౌర్ణమి పురస్కరించుకొని స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, విశేష పూజలతో పాటు యజ్ఞం, యజ్ఞో పవిత ధారణ, స్వామి వారి పల్లకి సేవ వేడుకలను ఘనంగా చేపడుతున్నట్లు పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు క్యాతన్ రఘునాథ్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని పద్మశాలీల కుటుంబాల ఇంటింటికి తిరుగుతూ ఆలయ అభివృద్ధి కోసం విరాళాలు సేకరించారు..

సందర్భంగా వారు మాట్లాడుతూ స్వామి వారి వేడుకలను ఘనంగా చేపట్టేందుకు ప్రతి ఒక్కరు విరాళాలు అందించి సహకరించాలని అన్నారు. ఈ నెల 27 28 తేదీల్లో జరిగే రాఖి పౌర్ణమి వేడుకల్లో ప్రతి ఒక్కరు తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి పట్టణ కార్యదర్శి తిలక్ బాబు, ఉపాధ్యక్షులు తాటి కృష్ణ , కర్లి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ.. ఉచిత క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరం

**మెదక్ టౌన్, ఆగస్టు 16(జనంసాక్షి):** మహిళల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా మెదక్‌లో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. తెలంగాణ రక్షణ సేన–టీఆర్ఎస్ పార్టీ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బట్టి అజయ్ ఆధ్వర్యంలో, హైదరాబాద్ హైటెక్ సిటీలోని సింధు హాస్పిటల్స్ సహకారంతో ఆదివారం పిల్లికోటియాల బస్తీ దవాఖాన, డబుల్ బెడ్‌రూమ్ వద్ద ఈ శిబిరం నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కొనసాగిన శిబిరానికి మహిళల నుంచి విశేష స్పందన లభించింది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఖరీదైన వైద్య పరీక్షలు చేయించుకోలేని పేద, మధ్యతరగతి కుటుంబాల మహిళలకు ఈ శిబిరం ఎంతో ఉపయోగకరంగా నిలిచింది.




ఈ సందర్భంగా బట్టి అజయ్ మాట్లాడుతూ, మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒక్కో మహిళకు సుమారు రూ. 20 వేల నుంచి రూ. 30 వేల విలువైన వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించినట్లు చెప్పారు. ముఖ్యంగా చెస్ట్ ఎక్స్‌రే, మామోగ్రామ్‌తో పాటు మహిళలకు సంబంధించిన వివిధ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించినట్లు వెల్లడించారు. క్యాన్సర్ నిర్ధారణ అయిన మహిళలకు సింధు హాస్పిటల్స్‌లో అవసరమైన సర్జరీలు, చికిత్సను ఉచితంగా అందించే కార్యక్రమాన్ని కూడా కొనసాగిస్తున్నట్లు బట్టి అజయ్ తెలిపారు. ప్రజాసేవే లక్ష్యంగా మెదక్ నియోజకవర్గ ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. రానున్న వారాల్లో ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించడంతో పాటు, అవసరమైన వారికి క్యాటరాక్ట్ సర్జరీలు, ఇతర కంటి శస్త్రచికిత్సలను ఉచితంగా అందించే కార్యక్రమాన్ని చేపడతామని తెలిపారు.

అలాగే సింధు హాస్పిటల్స్ యాజమాన్యం, స్పెషలిస్ట్ వైద్యులు, నర్సులు, టెక్నీషియన్లు శిబిరంలో పాల్గొని మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన–టీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఇప్పా రమేష్, నందకిశోర్, కాసాపురం అశోక్, జంగం నాగరాజు, వేపూరి శ్రీనివాస్, ప్రేమ్, మధు కార్తీక్, ముహమ్మద్ సమీర్, జుబేర్, సాయి, రిజ్వాన్, చంద్రపాల్ సార్ తదితర నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# మాజీ ప్రధాని వాజ్‌పేయికి ఘన నివాళి

- **గ్రామీణ సడక్, అంత్యోదయ పథకాలను కొనియాడిన నేతలు**
- **ఏదుల మండల కేంద్రంలో వాజ్ పేయి చిత్రపటానికి నివాళులు అర్పించిన బిజెపి నాయకులు**

**రేవల్లి, ఆగస్టు 16(జనంసాక్షి):** ఏదుల మండల కేంద్రంలో భారతరత్న, మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయికి ఘనమైన నివాళులు అర్పించారు. ఏదుల మండల బిజెపి అధ్యక్షులు రాము యాదవ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథులుగా సబ్బిరెడ్డి వెంకట్ రెడ్డి, ఏదుల మండల ఇంచార్జి సురేందర్ యాదవ్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, వాజ్‌పేయి గారి పాలనలో ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకాన్ని ప్రారంభించి గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించారు. అంత్యోదయ అన్న యోజన పథకం కింద నిరుపేదలకు 35 కిలోల రేషన్ కార్డును జారీ చేసి పేదల ఆకలి



తీర్చారని గుర్తు చేశారు.

పార్లమెంటులో ప్రభుత్వ ఏర్పాటుకు ఒక్క ఓటు అవసరమైనప్పటికీ ఎంపీలను కొనుగోలు చేయకుండా, నిజాయితీతో, నిబద్ధతతో పార్లమెంటును రద్దుచేసి మళ్ళీ ఎన్నికలకు వెళ్లిన మహానుభావుడు వాజ్‌పేయి అని అన్నారు. ఆయన విలువలతో కూడిన రాజకీయాలకు ప్రతీక అని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మనివర్ధన్ సాగర్, ఏదుల మండల అధ్యక్షుడు రాము యాదవ్, మాచుపల్లి వాస్తవ్యులు సునందన్ గౌడ్, చీర్కపల్లి బూత్ అధ్యక్షులు మహేష్ యాదవ్, పార్టీ కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణకు భారీ జన సమీకరణ...

- **ఉమ్మడి పాలమూరు నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలి**
- **గౌడ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఆనంద్ కుమార్ గౌడ్**



**మహబూబ్‌నగర్ ప్రతినిధి ఆగస్టు 16(జనంసాక్షి):** హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఈ నెల 18న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ జరగనున్న నేపథ్యంలో ఉమ్మడి పాలమూరు జిల్లా నుంచి బహుజన ,బీసీ, గౌడ సామాజిక వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉమ్మడి జిల్లా గౌడ సంఘం అధ్యక్షులు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు.

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కాటమయ్య దేవాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ చారిత్రక ఘట్టమని, ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఉమ్మడి పాలమూరు జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో బీసీ, గౌడ సామాజిక వర్గాల ప్రజలు తరలిరావాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని గ్రామాల చెందిన సొసైటీ సభ్యులు టిఎఫ్టి లైసెన్స్ దారులు.. గీత కార్మికులు.. గౌడ ఉద్యోగులు ..రిటైర్డ్ ఉద్యోగులు.. పెన్షనర్లు గౌడ బంధువులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు..

విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ప్రజలను సమీకరించేందుకు చేపట్టాల్సిన కార్యాచరణ, ఏర్పాట్లు, ప్రయాణ సౌకర్యాలు తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ఆయన ఆశయాలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆనంద్ కుమార్ గౌడ్ అన్నారు. బడుగు బలహీన వర్గాలకు అండగా నిలబడి .. బహుజనులను ఏకం చేసి 21 కోటలను జయించి ,గోల్కొండ కోటను ఏలిన చక్రవర్తి అని కొనియాడారు..

ఈ చారిత్రక కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు బీసీ, గౌడ సామాజిక వర్గాల నాయకులు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని ఆయన కోరారు. సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించడం హర్షించదగిన విషయమని పేర్కొన్నారు..

ఈనెల 18న అన్ని జిల్లాలు మండలాలలో సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఆకారం అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుంచి హైదరాబాద్ బయలుదేరి ట్యాంక్ బండ్కు చేరుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ విలేకరుల సమావేశంలో వనపర్తి జిల్లా గౌడ సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ నాగర్కర్నూల్ జిల్లా గౌడ సంఘం అధ్యక్షులు మల్లన్న,గౌడ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు వెంకటస్వామి గౌడ్ ,పెన్షనర్ల ఉద్యోగుల సంఘం అధ్యక్షులు సాయిల్ గౌడ్ ,గౌడ సంఘం నాయకులు లిక్కి నవీన్ గౌడ్ రమేష్ గౌడ్ ,రాజయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు

# ఘనపూర్ మండలానికి S.I.Rలో ప్రథమ స్థానం

• **ఉత్తమ తహశీల్దార్‌గా బి.సుగుణ**



**ఖిల్లా ఘనపురం, ఆగస్టు16(జనంసాక్షి):** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో గణనీయమైన పురోగతి సాధించి, జిల్లాలోనే ఘనపూర్ మండలాన్ని ప్రథమ స్థానంలో నిలిపినందుకు గాను మండల తహశీల్దార్ బి. సుగుణ ప్రత్యేక ప్రశంసలు అందుకున్నారు. స్వతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లా కలెక్టరేట్ సముదాయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఈ ఘనతను అధికారికంగా గుర్తించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ప్రముఖులు పట్నం మహేందర్ , జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, శాసనసభ్యులు మేఘారెడ్డి చేతుల మీదుగా తహశీల్దార్ బి. సుగుణ 'ఉత్తమ తహశీల్దార్' పురస్కారాన్ని, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.

**అభినందనల వెల్లువ...**

మండల ప్రజలతో నిత్యం మమేకమవుతూ, సేవలందించడంలో ఆమె చూపుతున్న చొరవను స్థానిక నాయకులు, ప్రజలు కొనియాడారు. తహశీల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రతిఒక్కరి సమస్యలను సానుకూలంగా పరిష్కరిస్తూ, పరిపాలనా రంగంలో ఆమె ప్రతిభ చాటుతున్నారని స్థానిక నాయకులు ఆగారం ప్రకాష్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా 100 శాతం గాను 92 శాతం నిర్దేశిత లక్ష్యాలను చేరుకుంటూ, మ్యాపింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేసి జిల్లాలోనే ఘనపూర్ మండలానికి అగ్రస్థానం తెచ్చిపెట్టడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ బి.సుగుణకు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు, మండల ప్రజలు ఘనంగా అభినందనలు తెలుపుతున్నారు.

# పరవస్తు సేవలు అభినందనీయం

• **ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి**





**వనపర్తి బ్యూరో, ఆగస్టు16 (జనంసాక్షి):** పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మధుకర్ స్వామి ఆధ్వర్యంలో సబ్‌ఇన్‌స్పెక్టర్, కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం నిర్వహించనున్న ఉచిత ప్రీ-రిక్రూట్‌మెంట్ శిక్షణకు సంబంధించి తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 11 కేంద్రాల్లో ఎలిజిబిలిటీ టెస్ట్ నిర్వహించారు. ఇందులో భాగంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన అభ్యర్థుల కోసం వనపర్తిలోని రేడియంట్ కాన్సెప్ట్ స్కూల్ పరీక్షా కేంద్రంలో పరీక్ష నిర్వహించగా సుమారు 500 మంది అభ్యర్థులు హాజరయ్యారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి అభ్యర్థులకు పరీక్షా పత్రాలను పంపిణీ చేసి పరీక్షను ప్రారంభించారు.ఈ సందర్భంగా డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి మాట్లాడుతూ, 2005 సంవత్సరం నుంచి ఇప్పటివరకు మధుకర్ స్వామి, గద్దె భాస్కర్ విద్యార్థులు, నిరుద్యోగ యువతకు అందిస్తున్న సేవలను ప్రత్యేకంగా అభినందించారు. గ్రామీణ, పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన యువతకు పోటీ పరీక్షలపై అవగాహన కల్పిస్తూ, ఉచిత శిక్షణ అందించడం ద్వారా ఉద్యోగ సాధనకు మార్గం చూపుతున్న వారి సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న యువతకు ఎలాంటి ఆర్థిక భారం లేకుండా నాణ్యమైన శిక్షణ అందించడం సామాజిక బాధ్యతతో కూడిన గొప్ప కార్యక్రమమని అన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించి, తెలంగాణ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో దోహదపడాలని ఆకాంక్షించారు.పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ గద్దె భాస్కర్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఎలిజిబిలిటీ టెస్ట్‌కు అభ్యర్థుల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. అర్హత సాధించిన అభ్యర్థులకు సబ్‌ఇన్‌స్పెక్టర్, కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం ఉచిత ప్రీ-రిక్రూట్‌మెంట్ శిక్షణ అందించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సాహిత్య కళావేదిక అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్, రేడియంట్ స్కూల్ ప్రిన్సిపాల్ ఉప్పరి తిరుమలేష్, పాఠశాల సిబ్బంది, ప్రభుత్వ ఉపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, కవిత, బాలసుబ్రమణ్యం, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు శైలజ, సాహితీ కళావేదిక ప్రతినిధులు భైరవ చంద్రశేఖర్, రాంకీ ఫౌండేషన్ ప్రతినిధులు, పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# దైవభక్తిని పెంపొందించుకోవాలి



**అమీన్పూర్, ఆగస్టు 16 (జనంసాక్షి):** దైవభక్తిని పెంపొందించుకోనీ నిత్యం కొంత సమయం దైవచింతనకు కేటాయించాలని పటాన్చెరువు శాసనసభ్యుడు గూడెం మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం బీరంగూడ డివిజన్ పరిధిలోని ఇసుక బావి కాలనీలోని శ్రీ పోచమ్మ తల్లి దేవాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శ్రీ గణపతి, సుబ్రహ్మణ్య స్వామి, నాగదేవత, శివలింగ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై.. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన దేవాలయాల నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు. అనంతరం తులసి వనం కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహా గౌడ్, సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, జగదీష్, యూనిస్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి తగుళ్ల కొండల్ యాదవ్ గారి ఆర్థిక చేయూత



**వెల్దండ, ఆగస్ట్ 16(జనంసాక్షి):** వెల్దండ మండలంలోని పోతేపల్లి గ్రామానికి చెందిన లిగన్నోజు కళావతి గారు అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న పోతేపల్లిగ్రామ సర్పంచ్ తగుళ్ల కొండలు యాదవ్‌లి గారు మృతుడి కుటుంబానికి BRS నాయకుల ద్వారా రూ.10,000/- అందజేశారు. ఈ కార్యక్రమంలో మైబు యాదవ్, ఎగిరిశెట్టి శివ,అంజి యాదవ్, సాయి యాదవ్, శ్రీశైలం, లట్టు యాదవ్, శేఖర్ చారి, తదితరులు ఉన్నారు.

## నాగల్ కడుమూరులో ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశంలో పాల్గొన్న రాజేందర్ రెడ్డి

**అమరచింత (జనంసాక్షి):** మండలంలోని నాగుల్ కడుమూర్‌లో ఆదివారం నాడు రాష్ట్ర మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి రాష్ట్ర టాడీ టాపర్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ కేశం నాగరాజ్ గౌడ్ అదేశానుసారంగా నాగల్ కడ్మూర్ గ్రామనికి చెందిన శ్రీమతి, శ్రీ పద్మ, కావలి చెన్నప్ప ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన అమరచింత మండల అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి , ఆదివారం ఇందిరమ్మ నూతన గృహప్రవేశాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల కోసం నిరంతరం కృషి చేస్తుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో అమరచింత పట్టణఅధ్యక్షుడు రవికాంత్ అమరచింత,మున్సిపల్ చైర్మన్ జింకా సువర్ణ రవి యాదవ్ నాగల్ కడ్మూర్ గ్రామ సర్పంచ్ శివ కుమార్ , మాజీ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి , వార్డు సభ్యులు దామోదర్ , కృష్ణ , శ్రావణ్ కుమార్ ,మల్లేష్ మరియు నరసింహులు గౌడ్ వెంకటేశ్వర్ రెడ్డి జోగు శంకర్ , లక్ష్మా రెడ్డి , వెంకటేశ్వర్ రెడ్డి , జోగు వెంకటేష్ , సురేందర్ రెడ్డి ,సత్య రెడ్డి ,జోగు కొండన్నా , సాథర్ల రాములు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొనడం జరిగింది.

# నీట్ విద్యార్థికి నాయకుల నగదు బహుమతి



**వెల్దండ, ఆగస్ట్ 16(జనంసాక్షి):** వెల్దండ మండలం పరిధిలోని ఎం.జి. కాలనీ తండా గ్రామ పంచాయతీలోని పిల్లికండ్ల తండా గ్రామానికి చెందిన రత్లావత్ మణిపాల్ కుమారుడు రత్లావత్ వినోద్ నీట్-కురుక్షేత్ర (హర్యానా)లో ఈ.ఈ.ఈ సీటు ఆల్ ఇండియా 3000 ర్యాంకు సాధించడం జరిగింది. ఈ విషయాన్ని తెలుసుకున్న కల్వకుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ ఉమా మనీలా సంజీవ్ కుమార్ యాదవ్ ఆదివారం సన్మానించి రూ.10 వేల రూపాయలు మరియు అల్లంతోట బావి తండా సర్పంచ్ రోజా అరుణ్ నాయక్ రూ.5 వేల రూపాయలు మొత్తం రూ.15 రూపాయలు ఆర్థిక సాయం చేయడం జరిగింది.అనంతరం సంజీవ్ కుమార్ యాదవ్ ప్రతీ సంవత్సరం రూ.10 వేల రూపాయలు అందజేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమములో మాజీ సర్పంచ్ కుమార్,మాజీ ఎంపీటీసీ సభ్యులు చిట్టి కదురం, గ్రామ కమిటీ అధ్యక్షులు సుధీర్,ఎల్ ఎచ్ పి ఎస్ మండల అధ్యక్షులు నర్సింగ్,అజయ్ మాజీ వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ విలువలకు నిలువుటద్దం...

• **దేశ అభివృద్ధికి పునాదులు వేసిన వాజ్ పేయి**
• **బిజెపి రాష్ట్ర నేత రతంగ్ పాండురెడ్డి**



**నారాయణపేట ఆగస్టు 16(జనంసాక్షి):** రాజకీయ విలువలకు నిలువుటద్దంగా నిలిచి భారత దేశ అభివృద్ధికి బాటలు వేసిన మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయి సేవలు చిరస్మరణీయమని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే.రతంగ్ పాండురెడ్డి,జిల్లా బిజెపి అధ్యక్షుడు సత్య యాదవ్ అన్నారు.వాజ్ పేయి వర్ధంతి సందర్భంగా ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో వాజ్ పేయి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని కావలసిన వాజ్‌పేయి ఒక్క ఓటుతో రాజకీయాలకు విలువ ఇస్తూ ప్రధాని పదవిని తృణప్రాయంగా వదులుకున్న వ్యక్తిగా చరిత్ర పుటల్లో నిలిచి పోయారని అన్నారు.తరువాత పూర్తి మెజారిటీతో అధికారంలోకి వచ్చి ప్రధానిగా ఎన్నికై దేశ అభివృద్ధికి పునాదులు వేశారని అన్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రజల అవసరాల కోసం ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యం ఉండాలని గ్రామీణ సడక్ యోజన తీసుకువచ్చి నేడు ప్రతి గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించారని, అలాగే పేద ప్రజలు ఆకలితో అలమటించకుండా ఉండాలనే ఉద్దేశంతో అంత్యోదయ అన్న యోజన పథకం తీసుకువచ్చి దారిద్ర రేఖకు దిగువ ఉన్న ప్రజల ఆకలి తీర్చారన్నారు. ముఖ్యంగా రహదారుల సౌకర్యం ఉంటేనే అభివృద్ధి సాధ్యం అవుతుందని అందుకోసం స్వర్ణ చతుర్భుజి జాతీయ రహదారులకు శ్రీకారం చుట్టారని అన్నారు.ఇలా అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి వాజ్‌పేయి చెరగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు. ఆ పతకాలను ప్రస్తుత ప్రధాని కొనసాగిస్తూ దేశాన్ని విశ్వగురు స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీ శ్యాంసుందర్ గౌడ్,జిల్లా కోశాధికారి సిద్ది వెంకట్ రాములు,మైనార్టీ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహబూబ్ అలీ పట్టణ బిజెపి అధ్యక్షుడు పోషల్ వినోద్, కౌన్సిలర్ ప్రభాకర్, మిర్చి వెంకటయ్య, జి.ఆర్.రెడ్డి, వడ్డేదత్తు తదితరులు పాల్గొన్నారు.

## నేడు మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి

• ఎంపీడీవో వరుణ్ తేజ్



**ఉప్పునుంతల, ఆగస్టు 16 (జనంసాక్షి):** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఉప్పునుంతల మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) వరుణ్ తేజ్ ఒక ప్రకటనలో తెలిపారు. నేడు సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉప్పునుంతల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు.

ప్రజల నుంచి వచ్చే సమస్యలు, వినతులను స్వీకరించి సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో తెలిపారు. ప్రజావాణి కార్యక్రమానికి మండలస్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరై, తమ శాఖలకు సంబంధించిన సమస్యలపై తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

## ఉత్సాహంగా ఉమ్మడి జిల్లా స్థాయి ట్రాక్ సైక్లింగ్ పోటీలు

• 5 జిల్లాల నుంచి 150 మంది క్రీడాకారిణుల భాగస్వామ్యం
• రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు



**మక్తల్, ఆగస్టు 16(జనంసాక్షి):** అస్మిత రాష్ట్రస్థాయి ట్రాక్ సైక్లింగ్ ఆర్గనైజర్ డాక్టర్ మాక్స్‌వెల్, సౌత్ జోన్ కోఆర్డినేటర్ ఎం.కె. పాషా ఆదేశాల మేరకు ఆదివారం మక్తల్‌లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థాయి ట్రాక్ సైక్లింగ్ పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ ?పోటీలను జిల్లా చైర్మన్ డాక్టర్ మణికంఠ గౌడ్, ప్రధాన కార్యదర్శి బి. గోపాలం సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా క్రీడల్లోనూ రాణించినప్పుడే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. క్రీడల్లో సాధించే సర్టిఫికెట్లు భవిష్యత్తులో స్పోర్ట్స్ కోటా కింద ఉన్నత చదువులకు, ఉద్యోగ అవకాశాలకు ఎంతో దోహదపడతాయని వివరించారు.

ఈ జిల్లా స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన బాలికలు, మహిళలను ఈ నెల 28 నుంచి 30 వరకు హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ సైక్లింగ్ అకాడమీలో నిర్వహించే రాష్ట్ర స్థాయి అస్మిత ఉమెన్స్ ట్రాక్ సైక్లింగ్ పోటీలకు పంపించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సైక్లింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు జి. శివకుమార్, పీడీ, పీఈటీలు సి. అమ్రేష్, రేణుక, అవంతి, బాల్‌రెడ్డి, త్రివేణి, యాదగిరి, న్యాయవాది నరేందర్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## గౌతపూర్ డ్రైనేజి సమస్య పరిష్కారం

• దాదాపు మూడు లక్షల యాభైవేల వ్యయంతో పనులు ప్రారంభం
• ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సర్పంచ్..
• గౌతపూర్ రెండుపడకల ఇళ్ల వద్ద డ్రైనేజీ పనులు ప్రారంభం!



**బాలానగర్, ఆగస్టు 16(జనంసాక్షి):** మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం గౌతపూర్ గ్రామపంచాయతీ అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. గ్రామ సర్పంచ్ తాళ్ల ప్రకాష్ గౌడ్ ఇచ్చిన హామీ మేరకు రెండు పడకల ఇళ్ల వద్ద పెండింగ్ లో ఉన్న డ్రైనేజీ సమస్యకు పరిష్కారం లభించింది.

ఎన్నికలకు ముందు రెండుపడకల ఇళ్ల లోని ప్రధాన సమస్యను స్వయంగా పరిశీలించిన సర్పంచ్ ప్రకాష్ గౌడ్, "అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ సమస్యను పరిష్కరిస్తాను" అని ఇచ్చిన మాటకు కట్టుబడి ఈరోజు పనులు ప్రారంభించారు.

**64 కుటుంబాలకు ఉపశమనం...**

రెండు పడకల ఇళ్ల 64 కుటుంబాలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యను దృష్టిలో ఉంచుకుని, రెండు పడక ఇళ్ల ముందు భాగంలో కొత్త డ్రైనేజీ లైన్ పనులను సర్పంచ్, ప్రకాష్ గౌడ్ స్వయంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రెండు పడకల ఇళ్ల,నివాసితులందరూ సర్పంచ్ తాళ్ల ప్రకాష్ గౌడ్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గౌతపూర్ గ్రామ సర్పంచ్ , ఉప సర్పంచ్,వార్డు సభ్యులు రెండు పడకల ఇళ్లలో ఉండే నివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



**అయిజ, ఆగస్టు 16(జనంసాక్షి):** అయిజ మండలం సంకాపురం గ్రామంలో రామకృష్ణమఠం హైదరాబాద్ వారి సౌజన్యంతో రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది.. సుమారు 200 మంది వైద్య పరీక్షలు నిర్వహించుకున్నారు. అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజీవ్ జాగీర్దార్, రామకృష్ణ సేవా సమితి సభ్యులు వెంకట్రాములు, కృష్ణ, సత్యనారాయణ, వీరభద్రుడు,దామోదర, గోపాల్, తిమ్మప్ప, ఈశ్వరన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కారు బోల్తా... అందులో ఉన్న ముగ్గురు క్షేమం



**కృష్ణ, ఆగస్టు 16 (జనంసాక్షి):** కృష్ణ మండలం గుడేబల్లూర్ గ్రామంలో సబ్ సబ్ స్టేషన్ ముందర, మెయిన్ రోడ్డు పైన ఆదివారం మధ్యాహ్నం కారు బోల్తా పడింది. ప్రమాదం చూస్తే ప్రాణాలు కోల్పోయి ఉంటారని భావించారు. కానీ అందులో ఉన్న భార్య, భర్త,కూతురు ఎలాంటి చిన్న గాయం తగలకుండా క్షేమంగా బయట పడడం విశేషం. శ్రావణమాసం సందర్భంగా మహా రాష్ట్ర పునా నుండి మక్తల్ మండలం పసుపుల దత్తాత్రేయ స్వామి దర్శనానికి వెళ్లేటప్పుడు కారు అదుపుతప్పి బోల్తా పడింది. దానిలో ఉన్న ముగ్గురు భర్త శ్రీ ప్రసాద్ గురువ హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ మేనేజర్, భార్య అశ్విని, కుమార్తె ముగ్గురు క్షేమంగా బయట పడ్డారు, ఎవరికి ఏమి చిన్న గాయాలు కూడా కాలేదు.అదే సమయంలో ముడుమల్ నుండి వస్తున్నా మంత్రి శ్రీహరి సోదరుడు వాకిటి శేషగిరి వెంటనే సంఘటనాన్ని సందర్శించి సురక్షితంగా వారిని వేరే వాహనంలో ఎస్ ఎస్ఐ సురేందర్ బాబు, చారి, పోలీస్ స్టేషన్‌కు పంపించారు. ఏమరపాటుతో ఉన్న కారు యజమాని నిద్రమత్తులో ఉన్నాడని అన్నారు. పక్కనే ఉన్న డ్రమ్మును చిన్న డీ.. కొట్టడంతో అక్కడే కారు బోల్తా పడింది. ఈ సంఘటనపై కృష్ణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## హల్ద్వానీ ఘటనను నిరసిస్తూ రేపు వనపర్తిలో ధర్నా



**వనపర్తి బ్యూరో, ఆగస్టు16(జనంసాక్షి):** ఏఐసీసీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేకు జరిగిన అవమానాన్ని నిరసిస్తూ టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్, టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పిలుపు మేరకు సోమవారం రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో నిరసన ధర్నాలు నిర్వహించనున్నట్లు డీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ జిల్లా చైర్మన్ ఈరపోగు రాజ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు వనపర్తి జిల్లా కేంద్రంలోని పానగల్ రోడ్డులో గల అంబేద్కర్ చౌరస్తాలో సోమవారం ఉదయం 11 గంటలకు నిరసన ధర్నా నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. డీసీసీ అధ్యక్షులు, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, ఎంపీ మల్లు రవి, రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ధర్నా కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు, మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, సర్పంచులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, మున్సిపల్ టౌన్ అధ్యక్షులు, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాజ్‌కుమార్ కోరారు.

### ఒంటరైన ఊరుకొండ ...

## నేటికి అభివృద్ధి శూన్యం

మండల ప్రజలు అనుకుంటున్నారు. అదే నిజమైతే కనీసం కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యే గాని రాజకీయ నాయకులు కానీ ఊరుకొండ మండలానికి కనీసం చుట్టపు చూపుగా వచ్చిన దాఖలాలు కూడా లేవు. ఊరుకొండ మండలం ఒంటరి అయ్యిందా అనే భావన ప్రతి ఒక్కరిలో నాటుకపోయింది.?

## హన్మకొండకు తరలిన న్యాయవాదులు



**నారాయణపేట, ఆగస్టు 16(జనంసాక్షి):** హన్మకొండలో ఆదివారం జరిగిన న్యాయవాద తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సమావేశానికి నారాయణపేట న్యాయవాదులు తరలివెళ్లి పాల్గొన్నారు. నారాయణపేట నుంచి పాల్గొన్న వారిలో కేంద్ర ప్రభుత్వ అదనపు న్యాయవాది, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నందు నామాజీ,కేంద్ర ప్రభుత్వ అదనపు న్యాయవాది కుర్మన్న గౌడ్,న్యాయ వాదులు నర్సింలు యాదవ్,భరత్,క్రాంతి కుమార్ ఉన్నారు.

## ఎఐసిసి మల్లికార్జున్ ఖర్గెను అవమానించడం తగదు

• కాంగ్రెస్ జిల్లా కార్యవర్గ సోమ సంతోషం



**కృష్ణ, ఆగస్టు 16(జనంసాక్షి):** ఉత్తరఖండలో కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికా ర్జున్ ఖర్గే పర్యటన అనంతరం నిర్వహించిన శుద్ధి చేయడాన్ని నారాయణ పేట జిల్లా కార్యవర్గ సభ్యులు గుడేబల్లూర్ సోమ సంతోషం ఖండించారు. తెలంగాణ ఇదే ప్రజాస్వామ్య విలువలకు, మానవ హక్కులకు విరుద్ధంగా అఘాయిత్య చర్యను ప్రజలు గమనించాలని, ప్రభుత్వం చట్టం ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇటువంటి వివక్షత చర్యలు సమాజంలో యువజనకు, దారి తిస్తాయని హెచ్చరిస్తూ ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడేవిధంగా కృష్ణ మండలం కాంగ్రెస్ పార్టీ తరపున ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



**చేర్యాల ఆగస్టు 16, (జనంసాక్షి) :** చుంచనకోట గ్రామానికి చెందిన దండబోయిన యాదగిరి మృతి చెందిన విషయం తెలుసుకున్న గ్రామ మాజీ సర్పంచ్ ఆది శ్రీనివాస్ మృతుడి పార్థివ దేహానికి పూలమాల వేసి ప్రగాఢ సంతాపాన్ని తెలిపి వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించిన అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చి రూ. 5వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

# మండల స్థాయిలో ప్రజావాణి: ఎంపీడీవో సునీత

- ప్రతి సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహణ
- ప్రజలు తమ సమస్యలను ప్రజావాణిలో వినతుల రూపంలో అందజేయాలి: ఎంపీడీవో



**కల్వకుర్తి,ఆగస్టు 16(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు కల్వకుర్తి మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం నుంచి నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) జిల్లెల్ల సునీత తెలిపారు.ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కల్వకుర్తి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని ప్రజలు తమ సమస్యలు, వినతులను ప్రజావాణి కార్యక్రమంలో అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందాలని సూచించారు.కల్వకుర్తి మండలంప్రజలకు అందుబాటులో ఉన్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కల్వకుర్తి ఎంపీడీవో జిల్లెల్ల సునీత కోరారు.

# మండల ప్రజలు ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి


## వెల్దండ ఎంపీడీవో సులోచన



**వెల్దండ, ఆగస్టు 16(జనంసాక్షి):** ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని వెల్దండ మండల ప్రజలు సద్వినియోగ పరచుకోవాలని ఎంపీడీవో సులోచన ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం 2026 ఆగస్టు 4న ఆదేశాల ప్రకారం ప్రజా సమస్యల పరిష్కారం కొరకు ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించ బడుతుందని పేర్కొన్నారు. నేడు సోమవారం ఆగస్టు 17 ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 01:00 గంటల వరకు వెల్దండ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజల యొక్క ఆర్జీలు ఫిర్యాదులు మరియు సమస్యలను నేరుగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వేగవంతమైన పరిష్కారం పొందడానికి ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ప్రజావాణిలో అన్ని శాఖలకు సంబంధించిన మండల స్థాయి అధికారులు హాజరవుతున్నారని తెలిపారు.

# ప్రతి సోమవారం మండల కేంద్రంలో ప్రజావాణి

- సమస్యల పరిష్కారానికి ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్ళాలని తల్పునూర్ పంచాయతీ కార్యదర్శి రమేష్ విజ్ఞప్తి



**రేవల్లి, ఆగస్టు 16(జనంసాక్షి):** గ్రామ ప్రజల సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 01 గంట వరకు రేవల్లి ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తల్పునూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి రమేష్ తెలియజేశారు.
ప్రజలకు ఏదైనా సమస్య ఉన్నట్లయితే నేరుగా వనపర్తికి వెళ్లకుండా ముందుగా మండల కేంద్రం రేవల్లిలోని ఎంపీ డీఓ కార్యాలయంలో జరిగే ప్రజావాణి కార్యక్రమంలో దర ఖాస్తు సమర్పించాలని సూచించారు. మండల స్థాయిలోనే సమస్యల పరిష్కారానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు.
ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావడానికి ఈ ప్రజావాణి కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుంది. కాబట్టి గ్రామస్తులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శి రమేష్ కోరారు.

# మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్‌ను పరామర్శించిన ముత్తిరెడ్డి



**చేర్యాల, ఆగస్టు 16(జనంసాక్షి):** చేర్యాల మాజీ జడ్పీటీసీ సుంకరి సరిత గౌడ్ (44) ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. ఆమె స్వగ్రామమైన ఆకునూరులో ఆదివారం దశ దినకర్మ జరుగగా ఈకార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి హాజరై చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. ముత్తిరెడ్డి కి అత్యంత ఆప్తుడిగా ఉన్న ఆమె భర్త సుంకరి మల్లేశం గౌడ్ కు తన హయాంలో రెండు పర్యాయాలు చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి, సరితకు జడ్పిటిసిగా అవకాశం ఇచ్చి తన ప్రేమను చాటుకున్నారు. ఆత్మీయ ప్రియ శిష్యున్ని పరామర్శించి ఓదార్చి మల్లేశం కుటుంబానికి ఎప్పుడూ అండగా ఉంటానని తెలిపారు.

# సొంత ఇంటి కలను సాకారం చేసేది కాంగ్రెస్ ప్రభుత్వం

- శాసనసభ్యులు గౌరవ తూడి మేఘారెడ్డి

**పెద్దమందడి, ఆగస్టు16 (జనంసాక్షి):** మండలం పరిధి మద్దిగట్ల గ్రామంలోని రాయి కంటి నాగన్న నూతన గృహప్రవేశ వేడుకకు ఆదివారం ముఖ్య అతిథిగా స్థానిక శాసన సభ్యులు మేఘా రెడ్డి హాజరయ్యారు.
ఈ శుభసందర్భంగా ఎమ్మెల్యే నూతన గృహంలో ప్రత్యేకంగా నిర్వహించిన సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొని, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం నాగన్న దంపతులను, వారి కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించి శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ సొంత ఇల్లు అనేది జీవితంలో ఒక మధురమైన స్వప్నమని, ఆ కలను సాకారం చేసుకోవడం ఎంతో అదృష్టమని పేర్కొన్నారు. కొత్త గృహంలో నాగన్న కుటుంబ సభ్యులు సిరిసంపదలతో, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. గృహప్రవేశ కార్యక్రమం అనంతరం ఆయన స్థానిక మండల నాయకులతో సమావేశమయ్యారు. గ్రామంలో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులు, ప్రభుత్వం నుంచి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాల అమలు పలు అంశాలపై వారితో చర్చించారు.



ఈ కార్యక్రమంలో వనపర్తి కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు సాయి చరణ్ రెడ్డి, మోజర్ల సర్పంచ్ శేఖర్, పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకటస్వామి, మాజీ ఎంపీపీ రఘు ప్రసాద్, సత్య రెడ్డి, పుట్టమొని నారాయణ, రామచంద్రయ్య గౌడ్, వెంకటేశ్వర రెడ్డి, బాబు రెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కల్వకుర్తిలో ఉచిత పోలీసు శిక్షణకు శ్రీకారం

- గ్రామీణ యువతకు ఉద్యోగ సాధనలో అండగా నిలుస్తున్న ఐక్యత ఫౌండేషన్
- మొదటి విడత విజయవంతం..రెండో విడతలో మరింత మెరుగైన శిక్షణ

**కల్వకుర్తి, ఆగస్టు16(జనంసాక్షి):** గ్రామీణ ప్రాంత యువతకు ప్రభుత్వ ఉద్యోగాల సాధనలో అండగా నిలవాలనే లక్ష్యంతో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో కల్వకుర్తిలో పోలీసు ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాల ఉచిత శిక్షణ రెండో విడతకు ఆదివారం శ్రీకారం చుట్టారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న పాత కృష్ణవేణి జూనియర్ కళాశాల భవనంలో శిక్షణను ఐక్యత ఫౌండేషన్ అధ్యక్షుడు,రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రధాన కార్యనిర్వహణ అధికారి సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ప్రారంభించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..యువత జీవితంలో ఉద్యోగం ఎంతో ముఖ్యమన్నారు. ఉద్యోగం కేవలం నెలసరి ఆదాయాన్నే కాకుండా యువకుడి జీవితానికి స్థిరత్వం, కుటుంబానికి ఆర్థిక భరోసా,తల్లిదండ్రులకు గౌరవాన్ని కల్పిస్తుందని పేర్కొన్నారు. పోలీసుశాఖలో ఎస్సై, కానిస్టేబుల్ తదితర ఉద్యోగాలకు వేలాది పోస్టులు అందుబాటులోకి వస్తున్న నేపథ్యంలో గ్రామీణ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.అవకాశం వచ్చిన తర్వాత సిద్ధం కావడం కాకుండా.. అవకాశం రాకముందే సిద్ధంగా ఉండాలన్నారు.



### ఆరు మండలాల్లో తొలి విడత పూర్తి...

నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో పోలీసు ఉద్యోగాల ఉచిత శిక్షణ తొలి విడతను విజయవంతంగా పూర్తి చేశామని రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. తొలి విడతలో యువతకు నాణ్యమైన శిక్షణతో పాటు పరీక్షల ద్వారా నిరంతర సాధన, మార్గదర్శకత్వం అందించామన్నారు. విద్యార్థుల స్పందన, తొలి విడత అనుభవాలను పరిగణనలోకి తీసుకుని రెండో విడతను మరింత మెరుగైన ప్రణాళికతో ప్రారంభిస్తున్నట్లు చెప్పారు.
గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ ఉన్న ప్రతి యువకుడికి సమాన అవకాశాలు కల్పించడమే లక్ష్యమన్నారు. ఆర్థిక పరిస్థితులు అడ్డంకిగా మారి ఏ విద్యార్థి ఉద్యోగ కలను వదులుకోకూడదని పేర్కొన్నారు. పోలీసు ఉద్యోగ శిక్షణతో



పాటు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు, మార్గదర్శకత్వం అందించి యువత భవిష్యత్తుకు బలమైన పునాది వేయడమే ఐక్యత ఫౌండేషన్ ఉద్దేశమన్నారు.

### విద్యార్థుల హర్షం...

శిక్షణ పొందుతున్న విద్యార్థులు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు వేలాది రూపాయలు ఖర్చు చేయకుండా ఉచితంగా నాణ్యమైన శిక్షణ అందించడం ఎంతో ఉపయోగకరమన్నారు. తమ కుటుంబ ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఉద్యోగ సాధనకు అవకాశం కల్పించిన సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.తమపై నమ్మకం ఉంచి ఉద్యోగ కలను సాకారం చేసుకునే దిశగా అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు.కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బోజిరెడ్డి, అధ్యాపకులు మోహన్‌లాల్,ఫౌండేషన్ సభ్యులు యూసుఫ్‌బాబా,గణేష్,శేఖర్,శ్రీపతి,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### చేర్యాల ప్రభుత్వ కళాశాల

## ప్రిన్సిపల్ జ్యోతికి ఉత్తమ పురస్కారం



**చేర్యాల, ఆగస్టు 16 (జనంసాక్షి):** స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా వివిధ రంగాలలో విశేషంగా కృషి చేసిన వారికి ప్రభుత్వం తరపున మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, జిల్లా కలెక్టర్ హైమావతి చేతుల మీదుగా అవార్డులను ప్రధానం చేశారు. చేర్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రికార్డు స్థాయిలో అడ్మిషన్లు పెంచదాంతో పాటు నాణ్యమైన విద్యాబోధన, విద్యార్థులకు కావాల్సిన సౌకర్యాలతో విద్యకు అవసరమైన నోట్బుక్స్, ఐఐబీ ప్యానెల్స్ వంటి వసతులు కల్పిస్తూ కళాశాలను ప్రగతిపథంలో నడిపిస్తున్నందుకు గాను ప్రిన్సిపల్ జ్యోతి ఉత్తమ అవార్డును అందుకున్నారు. ఈ పురస్కారంతో చేర్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలకు పేరుతోపాటు రానున్న సంవత్సరంలో మరికొంత మంది విద్యార్థులు చేరేందుకు ఎంతో తోడ్పడుతుందని ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు.

### ఫోటో స్టూడియోలు

## వెలవెల.. కొబ్బరి వ్యాపారంతో జీవన పోరాటం!



**నారాయణఖేడ్, ఆగస్టు 16(జనంసాక్షి):** ఒకప్పుడు పెళ్లిళ్లు, శుభకార్యాలు, పాస్‌పోర్ట్ ఫొటోలు, ఫంక్షన్ల ఫొటోగ్రఫీతో కళకళలాడిన ఫోటో స్టూడియోలు ప్రస్తుతం ఆధునిక సాంకేతికత ప్రభావంతో వెలవెలబోతున్నాయి. సెల్‌ఫోన్ కెమెరాలు, డిజిటల్ ఫోటోగ్రఫీ, ఆన్‌లైన్ సేవలు పెరగడంతో సంప్రదాయ ఫోటో స్టూడియోలపై తీవ్ర ప్రభావం పడుతోంది. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలోనూ పలువురు ఫోటోగ్రాఫర్లు ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. ఒకప్పుడు రోజంతా కస్టమర్లతో రద్దీగా కనిపించిన స్టూడియోలు ఇప్పుడు అప్పుడప్పుడూ వచ్చే పనులతోనే నెట్టుకొస్తున్నాయి. దీంతో కుటుంబ పోషణ కోసం కొందరు ఫోటోగ్రాఫర్లు ఇతర ఉపాధి మార్గాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

### ప్రతి సోమవారం ప్రజావాణి

## అన్ని మండలాల ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఆగస్టు16(జనంసాక్షి):** ఈనెల 17 నుంచి ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని అన్ని మండలాల ఎంపిడిఓ కార్యాలయాల్లో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక అదివారం ఒక ప్రకటనలో తెలిపారు.మండల ప్రజలు తమ సమస్యల దరఖాస్తులను మండల స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో ఇవ్వాలని తెలిపారు.

ఇట్టి ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల మండలస్థాయి అధికారులు సకాలంలో హాజరుకావలని సూచించారు. ప్రజల సౌకర్యార్థం ప్రజావాణి కార్యక్రమాన్ని మండల స్థాయిలో నిర్వహిస్తున్నందున, ప్రజలు తమ సమస్యలు, వినతులు ఇచ్చేందుకు జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం లేదని కలెక్టర్ తెలిపారు. మండల స్థాయిలో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పరిశీలించి, ఆన్లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యల దరఖాస్తులను మండల స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో అందచేయాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

## రైతుల ఆందోళనపై స్పందన.. రెట్లకుంట చెరువు కట్టకు మరమ్మతులు



**గోపాలపేట, ఆగస్టు 16(జనంసాక్షి):** గోపాలపేట మండల కేంద్రంలోని రెట్లకుంట చెరువులోకి డి-8 కాల్వ ద్వారా నీటిని విడుదల చేయడంతో చెరువులోకి నీరు చేరడం ప్రారంభమైంది. అయితే చెరువు కట్ట పలు ప్రాంతాల్లో బలహీనంగా ఉండటంతో ఆందోళన వ్యక్తం చేసిన రైతులు, స్థానికులు ఈ విషయాన్ని గ్రామ సర్పంచ్ కర్రోళ్ల స్వప్న భాస్కర్ దృష్టికి తీసుకెళ్లారు. చెరువు పూర్తిస్థాయిలో నిండిన సమయంలో బలహీనంగా ఉన్న కట్టకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని వారు తెలిపారు.

రైతులు, స్థానికుల సమస్యపై సర్పంచ్ స్వప్న భాస్కర్ తక్షణమే స్పందించారు. ఆదివారం జేసీబీ సహాయంతో చెరువు కట్ట బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో మరమ్మతు పనులు చేపట్టించారు. ముందస్తు చర్యగా కట్టను బలోపేతం చేయడంతో వర్షాలు, కాల్వ ద్వారా వచ్చే నీటితో చెరువు నీటిమట్టం పెరిగినా ప్రమాదం లేకుండా ఉండేందుకు చర్యలు తీసుకున్నారు. సమస్యను గుర్తించిన వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టడంపై రైతులు, స్థానికులు సర్పంచ్‌కు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మన్యం నాయక్, శరత్ బాబు, కొంకలి రామస్వామి, ఓంకారం టైలర్ వెంకటేష్, రవి కొండస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఈజీ మనీ కోసం వరుస హత్యలు.. మరో నలుగురి హత్యకు పన్నాగం

- సినిమాను తలపించేలా వ్యూహం.. పోలీసుల దర్యాప్తులో విస్తుపోయే నిజాలు
- వీడిన మహిళా హత్య కేసు మిస్టరీ.. తల్లి, కొడుకు అరెస్ట్







**సిద్దిపేట బ్యూరో, ఆగస్టు 16(జనంసాక్షి):** ఒంటరి మహిళలు, కుటుంబ సమస్యలతో ఉన్న మహిళలను లక్ష్యంగా చేసుకుని బంగారం కోసం హత్యలకు పాల్పడుతున్న తల్లి, ఆమె మైనర్ కుమారుడి వ్యవహారం సిద్దిపేట జిల్లాలో కలకలం రేపింది. అక్బర్‌పేట-భూంపల్లి మండలం రామక్కపేట గ్రామ శివారులో కాలిపోయిన స్థితిలో లభించిన మహిళ మృతదేహం కేసు దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి.

సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ ఆదివారం సీపీ కార్యాలయంలో ఏసీపీ రవీందర్‌రెడ్డితో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. వారం రోజుల క్రితం రామక్కపేట గ్రామ శివారులో మహిళ మృతదేహం కాలిపోయిన స్థితిలో గుర్తించగా, ఆమెను అక్బర్‌పేట-భూంపల్లి డబుల్ బెడ్‌రూమ్ కాలనీకి చెందిన అధికం విజయ (45)గా గుర్తించినట్లు తెలిపారు.

**కిరాణా షాపులోనే హత్య...**

విజయ హత్యపై సీసీఎస్, టాస్క్‌ఫోర్స్, క్రైమ్ పోలీసుల బృందాలు సమన్వయంతో దర్యాప్తు చేపట్టగా నమ్మలేని నిజాలు బయటపడ్డాయని సీపీ తెలిపారు. అదే డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో కిరాణా దుకాణం నిర్వహిస్తున్న చాకలి రజిత తన మైనర్ కుమారుడి సహకారంతో విజయను హత్య చేసినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. గత ఆదివారం సాయంత్రం తన దుకాణానికి వచ్చిన విజయను కుమారుడి సహాయంతో గొంతు నులిమి హత్య చేసి, ఆమె ఒంటిపై ఉన్న బంగారాన్ని అపహరించినట్లు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని దుకాణంలోనే ఉంచి, బంగారాన్ని స్థానిక గోల్డ్ షాపులో విక్రయించినట్లు చెప్పారు. వచ్చిన డబ్బుతో పెట్రోల్ కొనుగోలు చేసి, రాత్రి సమయంలో మృతదేహాన్ని బ్యాగులో కుక్కి టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై రామక్కపేట గ్రామ శివారుకు తీసుకెళ్లి తగులబెట్టినట్లు సీపీ వివరించారు.

**మరో మహిళ హత్యలోనూ ఇదే తల్లి, కొడుకు...**



విజయ హత్యతో పాటు గత మే నెలలో అదే డబుల్ బెడ్‌రూమ్ కాలనీకి చెందిన వివాహిత కుంట రేఖను కూడా ఇదే తల్లి, కొడుకు హత్య చేసినట్లు దర్యాప్తులో వెల్లడైందని సీపీ తెలిపారు. రేఖను కూడా దుకాణానికి వచ్చిన సమయంలో హత్య చేసి, మృతదేహాన్ని సిద్దిపేట జిల్లా శివారులోని అచ్చుమాయపల్లి అటవీ ప్రాంతానికి తరలించి కాల్చివేసినట్లు పేర్కొన్నారు. రేఖ కుటుంబ సభ్యులు మిస్సింగ్ ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులను సైతం తల్లి, కొడుకు తప్పుదోవ పట్టించినట్లు సీపీ తెలిపారు.

**సర్పంచ్‌పై దాడి.. బంగారం అపహరణ...**

గత ఏడాది జూన్‌లో ప్రస్తుత భూంపల్లి సర్పంచ్ అన్నపూర్ణ వాకింగ్‌కు వెళ్తున్న సమయంలో ఆమె తలపై రాయితో దాడి చేసి బంగారం అపహరించినట్లు విచారణలో నిందితులు అంగీకరించినట్లు సీపీ వెల్లడించారు.

ఇంతటితో ఆగకుండా డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో మరో నలుగురిని హత్య చేసేందుకు కూడా తల్లి, కొడుకు పథకం సిద్ధం చేసుకున్నట్లు దర్యాప్తులో బయటపడిందన్నారు.

**భారీగా నగదు, బంగారం, వెండి స్వాధీనం...**

నిందితుల నుంచి రూ.1.03 లక్షల నగదు, 5.61 తులాల బంగారం, 53 తులాల వెండి, టీవీఎస్ ఎక్సెల్ వాహనం స్వాధీనం చేసుకున్నట్లు సీపీ రష్మీ పెరుమాళ్ తెలిపారు. కేసులో నిందితురాలైన రజితను అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు, ఆమె మైనర్ కుమారుడిని జువైనల్ హోమ్‌కు తరలించినట్లు సీపీ వివరించారు. ఈ కేసును ఛేదించడంలో కీలకంగా పనిచేసిన సీసీఎస్, టాస్క్ ఫోర్స్, క్రైమ్ పోలీసు బృందాలను పోలీసు అధికారులు అభినందించారు.